సర్వజనుల దురవస్థ

ఆంధ్రజ్యోతి విజిట్



మూతపడ్డ ప్రధాన ద్వారం

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అనేక దుర్భతలతో కునారిల్లుతున్నది. ఆస్పత్రికి వెళ్లిన వాళ్లు వ్యాధుల బాధల కన్నా అసౌకర్యాలతో ఇబ్బందిపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ కమిటీ సమావేశం దాదాపు 20 నెలల తర్వాత సోమవారం జరగనుంది. ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య నానాటికీ పెరుగుతున్నా సౌకర్యాలు మాత్రం పెరగడం లేదని, హెచ్‌డీఎస్ సమావేశాల్లో చర్చలు తప్ప ఆచరణ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ సందర్భంగా ఆస్పత్రి దుస్థితిపై కథనం...

- ముందుకు సాగని ఐపీడీ బ్లాక్ పనులు
- మందుల కొరత.. పరీక్షల కోసం ఇక్కట్లు
- ఒకే ప్రధాన ద్వారంతో రోగుల ఇబ్బందులు
- 20 నెలల తర్వాత ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశం

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రి ముందుండే ఎన్టీఆర్ సర్కిల్ నిత్యం రద్దీగా ఉంటుంది. కొంతకాలం కింద ఆసుపత్రి ప్రధాన ద్వారం మూసేశారు. ప్రస్తుతం ఆసుపత్రిలోకి వెళ్లడానికి, రావడానికి ఒకటే గేటు ఉంది. అది సూపర్‌స్పెషాలిటీ ఓపీ బ్లాక్ వద్ద ఉంది. దీంతో అక్కడ రద్దీ నెలకొంది. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. అంబులెన్సులు కూడా రావడం కష్టంగా మారింది. నేడు జరగబోయే ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశంలోనైనా ఇన్‌గేట్‌ను ప్రారంభించాలని రోగులు కోరుతున్నారు.

ఫ్యాన్లు లేక ఉక్కపోత

ఆసుపత్రిలో ఫ్యాన్లు లేక రోగులు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. 8 నెలలుగా ఫ్యాన్లు కొనలేదు. చెడిపోయిన ఫ్యాన్లకు మరమ్మతులు చేయించలేదు. అధికారుల రూములో మాత్రమే మరమ్మతు చేయిస్తున్నారు. గైనిక్, చిన్నపిల్లల వార్డులతో పాటు చాలా వార్డుల్లో ఫ్యాన్లు తిరగడం లేదు.



గైనిక్ వార్డులో పని చేయని ఫ్యాన్

పందులు, కోతుల బెడద



బూత్‌బంగ్లా వద్ద పందులు

ఆసుపత్రిలోని సూపర్ స్పెషాలిటీ బ్లాక్, బూత్‌బంగ్లా, మానసిక వ్యాధుల విభాగం, హౌస్ సర్జన్ క్వార్టర్లు, ఎంసీహెచ్ బ్లాక్ వద్ద పందులు స్వైర విహారం చేస్తున్నాయి. సెక్యూరిటీ గార్డులు చేతులెత్తేశారు. పందులు గుంపులు గుంపులుగా చేరడంతో అపరిశుభ్రత నెలకొంది. ఎంసీహెచ్ బ్లాక్‌లో కోతుల బెడదతో రోగులు, వారి సహాయకులు ఆందోళన చెందుతున్నారు.

ఆగిపోయిన ఐపీడీ బ్లాక్

గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పనుల కింద రూ.500 కోట్లతో ఐపీడీ బ్లాక్, న్యూలెక్చరర్ గ్యాలరీ నిర్మాణ పనులు ప్రారంభించింది. రూ.500 కోట్లతో టెండరు కూడా పిలిచారు. ఐపీడీ బ్లాక్ పనులను కేఎంవీ సంస్థ ప్రారంభించింది. రూ.17.89 కోట్ల మేర బిల్లులు చెల్లించకపోవడంతో కొత్త పనులకు అనుమతులు లేకపోవడంతో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం నిర్మాణాలు పూర్తి కావాలంటే రూ.130 కోట్లు అవసరం అవుతోంది. హెచ్‌డీఎస్ సమావేశంలో ఐపీడీ బ్లాక్‌కు నిధులు కేటాయించాలని రోగులు కోరుతున్నారు.

మందుల కొరత

ఆసుపత్రిలో మందులు తగినన్ని లేవు. మూడు నెలలుగా సాధారణ మందులు కూడా అందుబాటులో లేవు. దీంతో అత్యవసర విభాగాల్లో రాత్రివేళలో మందుల కోసం బయటికి రాస్తున్నారు. క్యాజువాల్టీలో ప్యాంటాప్ ఇంజెక్షన్ల కొరత తీవ్రంగా నెలకొంది.

మరికొన్ని సమస్యలు

ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఒక రోగికి ఇద్దరు, ముగ్గురు సహాయకులు వస్తుంటారు. దీంతో అత్యవసర విభాగాలు, వార్డుల్లో రద్దీ పెరిగింది. వార్డుల్లో ఇన్‌ఫెక్షన్లు పెరుగుతున్నాయి. ఈసారైనా రోగుల సహాయకులకు విజిటర్ పాసులను ఏర్పాటు చేసి ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉంది.



డయాగ్నోస్టిక్ బ్లాకులో పరీక్షల నివేదికల కోసం వేచి చూస్తున్న రోగులు

- న్యూడయాగ్నోస్టిక్ బ్లాక్‌లో నిర్ధారణ పరీక్షలు గందరగోళంగా మారాయి. అత్యంత కీలకమైన న్యూడయాగ్నోస్టిక్ బ్లాక్‌లో పరీక్షల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వైద్యులు రాసిన పరీక్షలు ఉదయం ఇస్తే మధ్యాహ్నం 3 గంటల తర్వాత కూడా రిపోర్టు ఇవ్వడం లేదు.

- ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికులకు 5 నెలలు, సెక్యూరిటీ గార్డులకు 4 నెలల నుంచి వేతనాలు అందడం లేదు. గత ఏడాదిగా దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదు. పెస్ట్ కంట్రోల్‌కు రూ.5.90 లక్షలు నెలకు చెల్లిస్తున్నా ఎలుకలు, పాముల నివారణకు మందులు కూడా లేవు.



రోగిని బంధువులే స్ట్రెచర్‌పై తీసుకువస్తున్న దృశ్యం

- ఆసుపత్రిలో సౌకర్యాలు కరువయ్యాయి. అత్యవసర విభాగాల్లో చేరిన రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. స్ట్రెచర్లు, వీల్ చైర్లు అందుబాటులో లేవు. ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోల కొరత ఉంది.
- ఔట్ సోర్సింగ్‌లకు పూర్తి స్థాయిలో సేవలు అందించేందుకు ప్రవేశపెట్టిన సాయంత్రం ఓపీలు సరిగ్గా అమలు కావడం లేదు. ఈ ఓపీల్లో కేవలం పీజీలు పనిచేస్తున్నారు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ఫ్యాన్ పని చేయడం లేదు



మాది అవుకు మండలం సింగనపల్లె. కాన్పు కోసం ఐదు రోజుల క్రితం గైనిక్-4 యూనిట్‌కు వచ్చాం. ఫ్యాన్ పని చేయడం లేదు. ఉక్కపోతతో అల్లాడిపోతున్నాము.

- శ్రీలేఖ, గర్భిణి, గైనిక్‌విభాగం

కాన్పుకు రూ. 1000 ఇచ్చాం

ఆసుపత్రికి శనివారం లొద్దిపల్లె నుంచి నా కూతురు మాదవిని తీసుకుని వచ్చాము. మగబిడ్డ పుట్టాడు. మగబిడ్డ పుట్టాడని సిబ్బంది రూ.1000 లు తీసుకున్నారు.

- వెంకటేశ్వర్మ, గర్భిణి తల్లి

నేడు హెచ్‌డీఎస్ సమావేశం



కలెక్టర్ అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ కమిటీ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్, ఐదు మంది హెచ్‌డీఎస్ సభ్యులు పాల్గొంటారు. ఆసుపత్రి అభివృద్ధికి కొన్ని తీర్మానాలు చేస్తాం.

- డా.కే. వెంకటేశ్వర్లు సూపరింటెండెంట్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

నేడు డా. బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9 గంటలకు కర్నూలు పాత బస్టాండు దగ్గర ఉన్న డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద పుష్పాలంకరణ, అనంతరం బహిరంగ సభ జరుగుతుందని, ఆ శాఖ సాధికారత అధికారి రంగలక్ష్మి ఆదివారం తెలిపారు. డా. అంబేడ్కర్ జయంతి సందర్భంగా జరిగే ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఎస్సీ కుల సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా కలెక్టర్ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న వసతి గృహంలో డా.బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కడప ప్రొఫెసర్ల పాగా

- స్థానిక ప్రొఫెసర్లలో ముసలం..
- ఆర్‌యూ, క్లస్టర్, ఉర్దూ యూనివర్సిటీల్లో నిత్యం వివాదాలు



కర్నూలు అర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 3 యూనివర్సిటీలలో కడప జిల్లాకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాగా వేశారనే విమర్శలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా వైసీపీకి అనుకూలంగా వ్యవహరించిన వారినే అందలం ఎక్కించారని కొందరు ప్రొఫెసర్లు ఆందోళన చెందుతున్నారు. పరిపాలనతో పాటు కీలక విషయాల్లో వారి పెత్తనం మితిమీరి పోవడంతో స్థానిక బోధన, బోధనేతర సిబ్బంది మండిపడుతున్నారు. రాయలసీమ యూనివర్సిటీ, క్లస్టర్ యూనివర్సిటీలకు రిజిస్ట్రార్లు, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఇన్‌చార్జి ఉపకులపతి కడప జిల్లాకు చెందిన వారిని నియమించడంతో పాలన వ్యవహారాల్లో వారు చెప్పిందే వేదంగా మారింది. దీనికి తోడు వర్సిటీల మధ్య ఆధిపత్య పోరుకు తెరలేపుతున్నారని విద్యార్థులు మండి పడుతున్నారు. క్లస్టర్, ఉర్దూ యూనివర్సిటీ రెండింటిని ఒకే క్యాంపస్‌లో ఏర్పాటు చేసి పెత్తనం అంతా ఓ వర్సిటీలో తానే చెలాయించాలనే లక్ష్యంగా ఓ అధికారి పావులు కదుపుతున్నట్లు ప్రచారం ఉంది. ఈ క్రమంలో ఇటీవల కర్నూలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను ఉర్దూ వర్సిటీకి అప్పగించాలని విద్యార్థి, మైనార్టీ సంఘాలను ఉసిగొలిపి ఆందోళనకు వారే తెరవెనుక ఉంటూ విద్యార్థుల మధ్య చిచ్చు రేపుతున్నారనే ప్రచారం ఉంది.

రాయలసీమ వర్సిటీలో ..

రాయలసీమ యూనివర్సిటీకి ప్రభుత్వం కొత్తగా ఉపకులపతిని నియమించినా పెత్తనం అంతా ఇద్దరు మాజీ ప్రొఫెసర్ల మధ్య సాగుతోందనే ప్రచారం ఉంది. ఉపకులపతిని కేవలం సీటుకే పరిమితం చేయడంలో ఓ అధికారి పాత్ర ఉందని విద్యార్థులు అంటున్నారు. ఈ క్రమంలో రాయలసీమ యూనివర్సిటీలో నిత్యం వివాదాలు తలెత్తుతున్నాయి. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌ను విద్యార్థులను అడ్డుపెట్టుకొని బలవంతంగా రాజీనామా చేయించి రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ అదనంగా ఇంజనీరింగ్ కళాశాల కు చెందిన ప్రిన్సిపాల్ బాధ్యతలు తన వద్దే పెట్టుకోవడంతో స్థానికంగా పని చేస్తున్న ప్రొఫెసర్లు గుర్రుగా ఉన్నారనే ప్రచారం ఉంది. పరిపాలన వ్యవహారాల్లో ఉపకులపతి వద్ద తనే కీలకంగా వ్యవహరిస్తూ పరిపాలన తాను చెప్పినట్లే నడవాలని చూడటంతో బోధన, బోధనేతర సిబ్బంది ఆయనతో వాగ్వివాదానికి దిగుతున్నట్లు తెలుస్తోంది. కొన్ని వివాదాస్పదఅంశాలు, కోర్టు కేసులో ముడి పడి ఉన్న పోస్టులను దగ్గరుండి నడిపించి తనకేమి సంబంధం లేదని, వర్సిటీలో ప్రొఫెసర్లను రెండు వర్గాలుగా చీల్చి ఒక వర్గాన్ని తనకు అనుకూలంగా మలచుకుని వర్సిటీ రాజకీయాలను శాసిస్తున్నాడనే విమర్శలున్నాయి.

క్లస్టర్ వర్సిటీలో ఇలా...

ప్రతిష్టాత్మకంగా కొత్త కోర్సులతో ఏర్పాటైన క్లస్టర్ వర్సిటీలో కూడా ఆధిపత్య పోరుతో పాలన గాడి తప్పిందనే ప్రచారం ఉంది. కేవీఆర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్స్ మధ్య రెండేళ్ల పాటు కోల్డ్‌వార్ జరగడంతో ఇద్దరు ప్రిన్సిపాల్స్‌ను, అప్పటి రిజిస్ట్రార్‌ను బదిలీ చేశారు. ఆ తర్వాత కడప జిల్లా నుంచి వచ్చిన రిజిస్ట్రార్ మరి కొందరు ఆధ్యాపకులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ప్రభుత్వానికి లేఖలు రాయడం, ఉర్దూ యూనివర్సిటీ అధికారులు వారికి వ్యతిరేకంగా మైనార్టీ వర్గాలను డిగ్రీ కళాశాల పరిశీలనకు పంపారు. దీనితోపాటు మంత్రి టీజీ భరత్‌ను ఇందులో లాగారు. వీటన్నిటి వల్ల విశ్వవాద్యాల పాలన రోడ్డున పడిందని ప్రొఫెసర్లు ఆందోళన చెందుతున్నారు.



అలాంటిది ఏమీ లేదు

అలాంటింది ఏమీ లేదు. అందరినీ కలుపుకొని పని చేయాలి. ఎవరి మధ్యా అభిప్రాయ భేదాలు ఉండవు. అన్ని సరిచేస్తా. ప్రొఫెసర్ల మధ్య తేడాలు రాకుండా అందరికీ న్యాయం జరిగేలా చూస్తా.

- వెంకట బసవ రావు, ఉపకులపతి, రాయలసీమ, ఇన్‌చార్జి క్లస్టర్ వర్సిటీ

రిజిస్ట్రార్‌లుగా స్థానికులకు అవకాశాలు కల్పించాలి

రిజిస్ట్రార్‌లుగా స్థానికంగా ఉన్న ప్రొఫెసర్లకు అవకాశాలు కల్పించాలి. నైపుణ్యం ఉన్న వారెందరో ఇక్కడి వర్సిటీల్లో ఉన్నారు. వారిని కాదని కింది స్థాయిలో అసిస్టెంట్ ప్రొఫెసర్లను రిజిస్ట్రార్‌లు నియమించడం వెనుక అంతర్యం బయట పెట్టాలి. స్థానికంగా ఉన్నఎందరో సీనియర్ ప్రొఫెసర్లకు అన్యాయం చేయడం మంచిది కాదు.

- భాస్కర్, రాష్ట్ర అధ్యక్షుడు, ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ)

తర్తూరులో ఘనంగా రంగనాథస్వామి రథోత్సవం



రంగనాథస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జూపాడుబంగ్లా మండలంలోని తర్తూరు గ్రామంలోని లక్ష్మీరంగనాథస్వామి వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం కన్నులపండువగా సాగింది. ముందుగా స్వామివారికి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి పల్లకీలో ఊరేగించి రథశాలపై స్వామివారిని ఆశీనులు చేశారు. సంప్రదాయబద్ధంగా చేసిన పూజల అనంతరం రథాన్ని గోవిందనామస్మరణతో వేలాదిమంది భక్తుల మధ్య ముందుకు లాగారు. ఈ కార్యక్రమానికి నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ సీనియర్ నాయకుడు మాండ్ర శివానందరెడ్డి, దేవాలయ అధికారి సాయికుమార్, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఆత్మకూరు డీఎస్పీ రామాంజనేయులు, టీడీపీ యువనాయకులు గౌరుజనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

శ్రీమఠంలో ఎస్‌బీఐ చైర్మన్ 7

కేజీబీవీ విద్యార్థుల హవా

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):కర్నూలు జిల్లా కేజీబీవీ కళాశాలలో చదివే ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు విడుదలైన ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో టాప్ ర్యాంకులు సాధించారు. కర్నూలు జిల్లా నుంచి కోడుమూరు, పంచలింగాల, ఓర్వకల్లు కేజీబీవీలలో చదివే ముగ్గురు విద్యార్థినులు సన్‌షైన్ స్టార్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 15వ తేదీ విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా అవార్డులు అందుకోబోతున్నారు. గూడూరు కేజీబీవీ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 983/1000 మార్కులు, కర్నూలు మండలం పంచలింగాల కేజీబీవీలో ఏఅండ్ టీ గ్రూపు విద్యార్థిని మానస 992/1000 మార్కులు, ఓర్వకల్లు కేజీబీవీ ఎంఈసీ గ్రూపు విద్యార్థిని 913/1000 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో అగ్రస్థానంలో నిలిచారు. వ్యవసాయ పేద కుటుంబం నుంచి వచ్చిన సాధారణ విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరిచారు. వీరి ప్రతిభను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం సన్‌షైన్ స్టార్స్ అవార్డు ఇచ్చి సన్మానిస్తున్నారు.

ఇంజనీర్ అవుతా



మాది వ్యవసాయ కుటుంబం. నాన్న ఆనంద్. అమ్మ లక్ష్మి. వారిద్దరు నిరక్షరాస్యులే. వారి మాదిరిగా నేను కష్టపడకూడదని కేజీబీవీ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు ఎప్పుడూ చెబుతుండేవారు. ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు రావడం ఆనందంగా ఉంది. బీటెక్‌లో ఇంజనీర్‌గా స్థిరపడాలన్నదే ఆకాంక్ష.

- ఉప్పరి సునీత, వై. కానాపురం, గూడూరు మండలం

చార్టెడ్ అకౌంట్ చేస్తా



ఓర్వకల్లు కేజీబీవీలో ఎంఈసీ గ్రూపులో 913 మార్కులు వచ్చాయి. సీఏ చేయాలన్నదే లక్ష్యం. చార్టెడ్ అకౌంటెంట్‌గా స్థిరపడాలనుకుంటున్నా. తండ్రి స్వాములు, అమ్మ వరలక్ష్మి వ్యవసాయం పనులు చేస్తున్నారు. ఈ అవార్డుకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది.

- బోయ హరిత, చిన్నటేకూరు

ఐఏఎస్ కావాలన్నదే లక్ష్యం



డిగ్రీలో బీకాం కోర్సు చేసి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతాను. ఐఏఎస్ కావాలన్నదే లక్ష్యం. తల్లిదండ్రులు టి. మహేష్, సువర్ణ పొలం పనులు చేసి మమ్మల్ని చదివిస్తున్నారు. వారి కలలను నిజం చేస్తా.

- టి. మానస, ఆర్. కొంతలపాడు, కర్నూలు మండలం

- ఇంటర్‌లో రాష్ట్రంలోనే అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత
- సన్‌షైన్ స్టార్స్ అవార్డుకు ఎంపికైన ర్యాంకర్లు
- 15న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా అవార్డుల ప్రదానం



టీడీపీలో కార్యకర్తలకే అందలం

- సమన్వయంతో ముందుకు సాగాలి
- బీటీ నాయుడు ఆత్మీయ సన్మాన సభలో మంత్రి టీజీ భరత్
- అధినేత చంద్రబాబుకు రుణపడి ఉంటా : ఎమ్మెల్సీ బీటీ



ఎమ్మెల్సీ బీటీ నాయుడు ఆత్మీయ సన్మాన సభలో మంత్రి టీజీ భరత్



సన్మాన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బీటీ నాయుడు, హాజరైన నాయకులు



బీటీ నాయుడును సన్మానిస్తున్న తుగ్గలి నాగేంద్ర

కర్నూలు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): 'టీడీపీలో నిబద్ధతతో పని చేసే కార్యకర్తలు, నాయకులకు అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు అండగా ఉంటారు. అందలం ఎక్కిస్తారని, అందుకు ఎమ్మెల్యేల కోటాలో రెండోసారి ఎమ్మెల్సీగా ఎంపికై మండలిలో అడుగుపెట్టిన బీటీ నాయుడే నిదర్శనం..' అని రాష్ట్ర వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. ఇటీవల ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన బీటీ నాయుడుకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. స్థానిక జడ్పీ సమావేశం హాల్‌లో జరిగిన ఆ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు, బీటీ అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు కష్టపడుతున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గాల స్థాయిలో కూటమి నాయకులు, కార్యకర్తలు కలసి సమన్వయంతో ముందుకు వెళ్లాలని, చిన్నచిన్న సమస్యలు ఉంటే చర్చించుకొని పరిష్కరించుకోవాలని సూచించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ టీడీపీలోనే బీసీలకు రాజకీయ చైతన్యం, పదవులు సాధ్యమన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మాట్లాడుతూ అధినేత చంద్రబాబు ఏ పని అప్పగించినా క్రమశిక్షణతో చేసేవారన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ రాజ్యాంగ పదవుల్లో బీసీలకు పెద్దపీట వేసిన పార్టీ టీడీపీనే అన్నారు. ఆదోని బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ ఆదోని కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని, అవి నీటిమీద బుడగలే అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో బలహీనవర్గాలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు.

టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, ఏపీ కురువ/కురబ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఆలూరు, మంత్రాలయం ఇన్‌చార్జిలు వీరభద్రగౌడ్, ఎన్.రాఘవేంద్రరెడ్డి, నాగేశ్వరరావు యాదవ్ తదితరులు మాట్లాడుతూ అధినేత చంద్రబాబు మనసు గెలుచుకున్న వ్యక్తి బీటీ నాయుడు అని కొనియాడారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా టీడీపీ సీనియర్ నాయకుడు మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకేపోగు ప్రభాకర్, సీనియర్ నాయకులు వైకుంఠం జ్యోతి ప్రసాద్, కేవీ సుబ్బారెడ్డి, గట్టు తిమ్మప్ప, నంద్యాల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పి. తిక్కారెడ్డి

చంద్రబాబుకు రుణపడి ఉంటా

: బీటీ నాయుడు

అధినేత, సీఎం చంద్రబాబు, యువనేత నారా లోకేశ్ ఎంతో నమ్మకంతో రెండోసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. వారికి జన్మాంతరం రుణపడి ఉంటా. బీసీలకు టీడీపీ ద్వారానే రాజకీయ చైతన్యం, రాజ్యాంగబద్ధమైన పదవులు సాధ్యం అవుతాయి. క్రమశిక్షణ, నిబద్ధతతో టీడీపీలో పని చేస్తే పదవులు, బీ-ఫారంలు ఇంటికే వస్తాయి. పేర్కొన్నారు. వైసీపీ అధ్యక్షుడు, పులివెందుల ఎమ్మెల్యే జగన్, ఆ పార్టీ నాయకులు దుష్ప్రచారాలను టీడీపీ శ్రేణులు ఎక్కడికక్కడ తిప్పికొట్టాలి.

రుధిరంతో అంబేడ్కర్ చిత్రం





రుధిరంతో చిత్రీకరించిన డా.బీఆర్. అంబేడ్కర్ చిత్రం

నంద్యాల పట్టణానికి చెందిన బ్యాంక్ ఉద్యోగి మాణిక్యరావు తన రుధిరంతో అంబేడ్కర్ చిత్రాన్ని గీశారు. సోమవారం డా.బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని సందర్భంగా మాణిక్యరావు దాదాపు రెండు గంటలు శ్రమించి తన రక్తంతో అంబేడ్కర్ చిత్రాన్ని చిత్రీకరించారు. ఈ చిత్రాన్ని బ్యాంకు ఉద్యోగులు అందరూ చూసి శభాష్ అని అంటున్నారు.

- నంద్యాల కల్చరల్ (ఆంధ్రజ్యోతి)

రాష్ట్రీయ ఆయుష్ అసోసియేషన్ ఏర్పాటు

జిల్లా అధ్యక్షుడిగా పీవీ నాగరాజు



ఎన్నికైన ఆయుష్ అసోసియేషన్ వైద్యులు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఆయుష్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా నగరానికి చెందిన సీనియర్ ఆయుర్వేద వైద్యుడు డా. పీవీ నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని బుధవారపేటలో జిల్లా ఆయుష్ వైద్యుల సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు డా. బంగారు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఉపాధ్యక్షులు డా. డీఏ పద్మనాభ రెడ్డి, డా. ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా డా.జే. మధుభూషణ్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ డా. నవీన్ కుమార్, ట్రెజరర్ డా.రజాక్ బాషా ఎన్నికయ్యారు.

కంచి యూనివర్శిటీలో ఉత్తమ విద్యావకాశాలు

వీసీ ఆచార్య గుళ్లపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న కంచి యూనివర్సిటీ వీసీ ఆచార్య గుళ్లపల్లి శ్రీనివాస్

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉత్తమ వ్యక్తిత్వంతోపాటు గొప్ప భవిష్యత్తును అందించే దిశగా కంచి యూనివర్శిటీలో అనేక విద్యావకాశాలు ఉన్నాయని కంచి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య గుళ్లపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం పాత నగరంలోని శంకరమందిరం ఎదురుగా ఉన్న కరివేన బ్రాహ్మణ నిత్యాన్న సత్రం కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనివర్శిటీ అందజేస్తున్న కోర్సులు, వాటి ఫీజుల వివరాలు, విద్యావకాశాలు, ఉపకారవేతనాలు తదితర అంశాలను వారు వివరించారు. తమిళనాడు రాష్ట్రంలోని కంచిలో శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహా విద్యాలయం (కంచి యూనివర్సిటీ)లో స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. వివరాలకు అడ్మిన్ నాగేశ్వరరావు సెల్ నెం. 96550 35217లో సంప్రదించాలని సూచించారు.

బ్యాగ్ అప్పగింత

కర్నూలు క్రైం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తూ బ్యాగ్ మరిచిపోయిన ఓ వ్యక్తికి కర్నూలు పోలీసులు అప్పగించారు. కొత్తపల్లికు చెందిన శ్రీధర్ బ్యాంకు ఉద్యోగి. ఆదివారం నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో ఉన్న ఓ ఫంక్షన్‌హాలులో పెళ్లికి హాజరయ్యాడు. ఆ తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి ఆటో ఎక్కి సుంకేసుల రోడ్డులో ఉన్న ఓ ఆసు పత్రికి వెళ్లాడు. ఆసుపత్రికి వెళ్లిన తర్వాత బ్యాగు మరిచిపోయినట్లు గు ర్తించాడు. దీంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు. వారు సీసీ కెమె రాల ద్వారా పరిశీలించి ఆటో నెంబరును గుర్తించి బ్యాగును అతనికి అప్పగించారు. ఆ బ్యాగులో పది గ్రాముల బంగారు కమ్మల జత ఉన్నట్లు శ్రీధర్ తెలిపారు.

దివ్యాంగులు రాయితీలను ఉపయోగించుకోవాలి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని దివ్యాంగుల ఉద్యోగులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు జిల్లా దివ్యాంగుల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎం.శివారెడ్డి, జనరల్ సెక్రటరీ కృష్ణుడు తెలి పారు. ఆదివారం సీ.క్యాంపులోని కార్యాలయంలో దివ్యాంగుల ఉద్యోగుల సమావేశం జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి అధ్యక్షతన జరిగింది. వారు మాట్లా డుతూ సదరం సర్టిఫికేట్లు, రైల్వే సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులు ఆన్‌లైన్ లోదరఖాస్తు చేసుకోవాలన్నారు. బదిరిలు బైక్, కారు డ్రైవింగ్ లైసెన్సు పొందాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులైతే ఆయా రోస్టర్లలో తీసుకోవాలన్నారు. 216 ఉద్యోగుల చట్టంలోని అంశాలన్నింటినీ ఉపయోగించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

శ్రీమఠంలో ఎస్‌బీఐ ఛైర్మన్

- రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్న ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి
- సోలార్ ఏర్పాటుకు రూ.40 లక్షలు విరాళం
- నూతన హంగులతో ఎస్‌బీఐ బ్రాంచ్ ప్రారంభం



శ్రీమఠానికి రూ.40 లక్షలతో సోలార్ ప్లాంటు పీఠాధిపతికి విరాళంగా ఇస్తున్న ఎస్‌బీఐ ఛైర్మన్ శ్రీనివాసుల శెట్టి

మంత్రాలయం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామిని ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా ఎస్‌బీఐ ఛైర్మన్ గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు మెమొంటో, శేషవస్త్రం, పరిమళప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మంత్రాలయంలో నూతన హంగులతో ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ బ్రాంచ్‌ను ఆయన మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి ఎస్‌బీఐ ఆధ్వర్యంలో సోలార్ ఫలకాలను నిర్మించేందుకు ఎస్‌బీఐ ఛైర్మన్ రూ.40 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అమరావతి చీఫ్ జనరల్ మేనేజర్లు రాజేష్ కుమార్ పాటిల్, సంజయ్ కుమార్, దినేష్‌గులాటి, ఆర్ఎం శ్రీనివాసులు, మంత్రాలయం మేనేజర్ రాజశేఖర్, రామచంద్ర నాయక్, కృష్ణవేణి, రవి, వీరేష్, నరసప్ప, మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్ జోషీ, సురేష్ కోనాపూర్, శ్రీపతాచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, బ్యాంకు సిబ్బంది కిరణ్ కుమార్, రాహూఫ్, నరసప్ప, ప్రసాద్, మహేష్, ఉరుకుందమ్మ, వీరేష్, విశోభ, రవి, రహంతుల్లా, మహబూబ్ బాషా, సద్దాం హుశేన్‌లు పాల్గొన్నారు.

శ్రీమఠానికి ఎస్ఐబీఐ సహకారం

శ్రీమఠంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఎస్‌బీఐ తోడ్పాటు ఇస్తూనే పరస్పర సహకారం అందిస్తామని ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. గతంలో ఎస్‌బీఐ ద్వారా సహకారం అందించామని, భవిష్యత్‌లో కూడా పూర్తి సహకారం అందిస్తామన్నారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటు వల్ల శ్రీమఠానికి విద్యుత్ ఆదా అవుతుందన్నారు.

బ్యాంకింగ్ రంగంలో దూసుకున్న పోతున్న ఎస్‌బీఐ

ప్రపంచ బ్యాంకింగ్ రంగంలో ఎస్‌బీఐ మెరుగైన సేవలు అందిస్తూ దూసుకుపోతోందని శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు కొనియాడారు. ఎస్‌బీఐ వ్యాపారస్థులు, రైతులు, పొదుపు గ్రూపు మహిళలకు అండగా ఉంటూ భద్రతకు మారుపేరుగా నిలిచిందన్నారు. రూ.40 లక్షలతో సోలార్ ప్రాజెక్టు మంజూరు చేయడం అభినందనీయమని అన్నారు.

రేపు టీజీవీ కళాక్షేత్రంలో తెలుగు నాటక రంగ వేడుకలు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త, మొదటి తెలుగు నాటక రచయిత కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో తెలుగు నాటకరంగ వేడుకలు నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్ష, కార్యదర్శులు పత్తి ఓబులయ్య, మహమ్మద్ మియా ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 6:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, అరుణభారతి వ్యవస్థాపక అధ్యక్షులు బీసీ రాజారెడ్డి తదితర ముఖ్యులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముందుగా నాటక రంగానికి విశేష సేవలు అందించిన 12 మంది సంగీత గురువులు, కళాకారులను 'కందుకూరి పురస్కారం'తో సత్కరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సత్య హరిశ్చంద్ర నాటకం (కాటిసీను) ఉంటుందని, ఇందులో సత్య హరిశ్చంద్రునిగా చల్లా నవీన్ కుమార్ చౌదరి, చంద్రమతిగా ఎంఆర్ రాధిక నటిస్తారని, సంగీత సహకారం ఎర్రమ పాండురంగయ్య అందజేస్తారని తెలిపారు. తర్వాత శ్రీకృష్ణ రాయబారం (పడక సీను) ఉంటుందని, ఇందులో శ్రీకృష్ణునిగా జీవీ శ్రీనివాసరెడ్డి, దుర్యోధనుడిగా కేవీ రమణ, అర్జునుడిగా కె.బాలవెంకటేశ్వర్లు నటిస్తారని, బలరాం సంగీత సహకారం అందిస్తారని వివరించారు. కళాకారులు, కళాభిమానులు ఈ వేడుకలకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఆర్టీసీ డిపో మేనేజర్ ఇంట్లో చోరీ

40 తులాల బంగారు ఆభరణాలు దొంగతనం



బాధితుని ఇంట్లో చోరీ జరిగిన అల్‌మారలు

కర్నూలు క్రైం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయివైభవ్ నగర్‌లో ఆర్టీసీ డిపో-2 మేనేజర్ సర్దార్ హుశేన్ ఇంట్లో భారీ చోరీ జరిగింది. సర్దార్ హుశేన్ తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం హైదరాబాదు వెళ్లారు. స్థానికులు ఆదివారం ఈయన ఇంట్లో చోరి జరిగిన విషయాన్ని గుర్తించి సమాచారం ఇచ్చారు. దీంతో బాధితుడు హైదరాబాదు నుంచే పోలీసులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. వారు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. సర్దార్ హుశేన్ వచ్చి పరిశీలించగా... ఇంటి ప్రధాన ద్వారం తలుపు పగులకొట్టి పడకగదిలోని బీరువాలో ఉన్న అల్మారాలో 40 తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్లు గుర్తించారు. మరి కొన్ని బంగారు ఆభరణాలు వేరే అల్మారాలో పెట్టడంతో అవి సురక్షితంగా ఉన్నాయి. సమీపంలో ఒక్క సీసీ కెమెరా కూడా లేకపోవడంతో పోలీసులు చోరీకి ఆధారాలు గ్రహించలేకపోయారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేషయ్య తెలిపారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

- 12 మందిపై కేసు నమోదు
- సాతనూరులో ఘటన



సాతనూరులో డా.బీఆర్ అంబేడ్కర్ బ్యానర్‌ను తొలగిస్తున్న దళిత వర్గం నాయకులు

కోసిగి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సాతనూరు గ్రామంలో దళితుల్లోని ఇరు వర్గాల ప్రజలు ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో 12 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సాతనూరు గ్రామంలో అగసనూరు, చిర్తనకల్ గ్రామాలకు వెళ్లే మలుపు రోడ్డు వద్ద గ్రామానికి చెందిన ఇరువర్గాల దళితులు ఏపీ దళిత ఐక్యవేదిక బోర్డు ఏర్పాటు చేసే విషయంలో గొడవ పడి పరస్పరం గాయాలు చేసుకున్నారు. ఇరువర్గాల దళితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒక వర్గానికి చెందిన హెచ్. రాజుతో పాటు ఐదుగురిపైన, మరో వర్గానికి చెందిన హెచ్. హను మయ్యతో పాటు మరో ఐదుగురిపైన కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు. సోమవారం అంబేడ్కర్ జయంతి వేడుకల కోసం స్థలం విషయంలో ఈ ఘర్షణ జరిగినట్లు స్థానికులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల కలయిక



మొలగవల్లి జడ్పీఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

ఆలూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలగవల్లి జడ్పీ ఉన్నత పాఠశాల 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 26 ఏళ్ల తర్వాత కలసి చదువుకున్న పాఠశాలల్లో కలసి తిరిగారు. ఆనాటి అల్లర్లను జ్ఞాపకం చేసుకున్నారు. ఉపాధ్యాయులను సన్మానించారు. సత్యనారాయణ, ఆంజనేయులు, ప్రభాకర్, హేమ, రంగస్వామి, సుధాకర్, రేఖ, పూర్వ విద్యార్థులు రవి కుమార్, భాస్కర్, రామాంజినేయులు, రంగనాథ్, బాల సుబ్రహ్మణ్యం, మారెన్న, శ్రీను పాల్గొన్నారు.

ఎల్లెల్సీలో యువకుడు గల్లంతు

హాలహర్వి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గూళ్యంకి చెందిన శివప్ప(22)అనే యువకుడు ఎల్లెల్సీలో గల్లంతైనట్లు ఎస్ఐ చంద్ర తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన శివప్ప ఆదివారం పొలానికి వెళ్లాడు. ఎంతసేపటికీ ఇంటికి తిరిగిరాలేదు. దీంతో తండ్రి మారెప్ప పొలం వద్దకు వెళ్లి వెతికాడు. అక్కడ కనిపించకపోవడంతో ఎల్ఎల్‌సీ కాల్వలో వెతుకులాట సాగించాడు. కాల్వలో కొంత దూరంలో శివప్ప శవం బయటపడింది. దీంతో ఆగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

తుగ్గలి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలి వెంకటేశ్(33) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. తమిళనాడుకు చెందిన రాజేశ్వరి అనే మహిళను గ్రామానికి తీసుకొచ్చి ఇద్దరూ సహజీవనం చేస్తుండేవారు. అయితే వారి మధ్య మనస్పర్థలు రావడంతో ఆ మహిళ గత నెల 14న వెంకటేశ్ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో ఒంటరి తనం భరించలేక జీవితంపై విరక్తి చెంది వెంకటేశ్ కూడా ఇంట్లో చీరతో ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా పోరాడుదాం



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహారావు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా పోరాడుదామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నరసింహారావు పిలుపునిచ్చారు. సీఐటీయూ నాయకత్వ ప్రాంతీయ వర్క్‌షాపులో భాగంగా రెండో రోజు ఆదివారం ఎస్ఎస్ ఫంక్షన్ హాలులో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభు త్వం కార్మికులకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. వర్క్‌షాపులోజిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు, రాష్ట్ర నాయకులు ఓబులు, అనంతంపురం, నంద్యాల, కడప, సత్యసాయి జిల్లాల కార్యదర్శులు నాగేంద్ర, మనోహర్, నాగరాజు, వెంకటేష, నగర నాయకులు సాయిబాబ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు నష్టాలపై అవగాహన కల్పించాలి

● ముస్లిం పర్సనల్ లా బోర్డు జేఏసీ కన్వీనర్ జాకీర్ మౌలానా


మాట్లాడుతున్న ముస్లిం సంఘాల నాయకులు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వక్ఫ్ సవరణ బిల్లు వల్లన జరిగే నష్టాలను ప్రజలకు వివరించే విధంగా కృషి చేయాలని ముస్లిం పర్సనల్ లా బోర్డు జేఏసీ కన్వీనర్ జాకీర్ మౌలానా అన్నారు. ఆదివారం మౌర్యఇన్ ఎదురుగా ఉన్న రిసల్దార్ మసీదులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు కొన్ని తీర్మానాలను ఆమోదించారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం మసీదులలో ఖుద్బా కంటే ముందు బయాన్‌కి బదులుగా వక్ఫ్ చట్ట సవరణ ద్వారా కలిగే నష్టాలను వివరించాలన్నారు. ప్రతి వీధిలో ఒక సమావేశం ఏర్పాటు చేసి బిల్లుపై అవగాహన పెంచాలన్నారు 20 నుంచి 29 వరకు రిలే నిరాహరదీక్షలు చేయాలని సమావేశంలో నిర్ణయించారన్నారు. 30న రాత్రి 9 గంటలకు కరెంటు ఆర్పివేసి నిరసన చేపట్టాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఫోమా నాయకులు ఎంఏ.హమీద్ అజీస్‌ఖాన్, సీపీఐ నగర కార్యదర్శి రాజశేఖర్, జమాతే ఇస్లామ ఏ హింద్ నాయకులు మునీర్ అహ్మద్, అబ్దుల్ రహిమాన్, ఆవాజ్ నగర అధ్యక్ష,కార్యదర్శులు ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండి.షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అధికార ప్రతినిధిగా కటికె గౌతమ్

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికార ప్రతినిధిగా కటికె గౌతమ్‌ను నియమిస్తూ పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర కార్యాలయం నుంచి జిల్లా కార్యాలయం ఉత్తర్వులు వచ్చినట్లు పార్టీ నాయకులు తెలిపారు. గార్గేయపురం గ్రామానికి చెందిన గౌతమ్ విద్యార్థి ఉద్యమాలలో కీలక పాత్రపోషించారని జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి కొనియాడారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ రద్దు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయంలో జరిగే ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం సోమవారం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి సెలవు కారణంగా రద్దు చేస్తున్నట్లు నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. వచ్చే సోమవారం నుంచి యథావిధిగా కొనసాగుతుందని, నగర ప్రజలు గమనించాలని కమిషనర్ పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో కిస్తీలు

ఓర్వకల్లు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నన్నూరు గ్రామ సమీపాన గల హజరత్‌సయ్యద్ జర్‌జరీ షాఖాద్రి ఉరుసు ఉత్సవాల సందర్భంగా ఆదివారం కిస్తీలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ కీస్తీలను తిలకించేందుకు ముస్లింలు తరలివచ్చారు. స్వామివారికి కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

23న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమయాజులపల్లెలో సుంకులమ్మ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా 23న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే టీములు రూ.400 ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు. గెలుపొందిన విజేతలకు మొదటి నుంచి ఆరు బహుమతులు వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు నగదు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాల కోసం 8074777028, 6303670448లను సంప్రదించాలన్నారు.

కె.నాగలాపురంలో బండలాడుగు పోటీలు


గెలుపొందిన ఎద్దుల యజమానికి నగదు అందజేస్తున్న దృశ్యం

గూడూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కె నాగలాపురం సుంకులా పరమేశ్వరి అమ్మవారి తిరుణాలను సందర్భంగా ఆదివారం పెంచికలపాడు గ్రామంలో బండలాగుడు పోటీలను ఎంపీటీసీ మద్దిలేటి, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరక్టర్ వెంకటరాముడు ప్రారంభించారు. అనంతరం పోటీలల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్ణం యుగంధర్, పోతురాజు దయ, శేఖర్, మధు, గౌండ ఖాజ, రాముడు, దయ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా బీపీ మండల్ వర్ధంతి


స్థానిక బీసీ భవన్‌లో బీపీ మండల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ భవన్‌లో ఆదివారం బీపీ మండల్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీసీ జేఏసీ ఏపీ క న్వీనర్ దేవపూజ ధనుంజయాచారి, అయ్యన్న యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు యాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరై మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు శేషఫణి, శ్రీరాములు యాదవ్, వడ్డెర బాలాజీ, లక్ష్మీనారాయణ, వెంపెంట రాంబాబు, విజయలక్ష్మి, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రెఫరీగా ఎంపికైన జగదీష్‌కు టీజీ అభినందన

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ కరాటే ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలో జడ్జిగా ఎంపికైన జగదీష్ కుమార్‌ను మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేశ్ అభినందించారు. ఆదివారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో అంతర్జాతీయ స్థాయిలో రెఫరీగా ఎంపికైన జగదీష్ కుమార్‌ను శాలువ కప్పి టీజీ వెంకటేశ్ సన్మానించారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్


మంత్రి టీజీ భరత్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్ ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతోనే జిల్లా అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో క్రిడాయ్ ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చెందుతోందని, ఇప్పటికే సెమీ కండక్టర్లు, డ్రోన్లు వంటి భారీ పరిశ్రమలు ఇక్కడ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరింత పారిశ్రామిక ప్రగతి జరగనుందని, జిల్లాకు మంచి రోజులు రానున్నట్లు ఆయన తెలిపారు. క్రిడాయ్ జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ మాట్లాడుతూ కర్నూలు పరిసరాల్లో ప్రత్యేక ఆర్థిక మండళ్ల ఏర్పాటు చేయాలని, మెరుగైన రవాణా సౌలభ్యం దృష్ట్యా రైల్వే డబుల్ లైన్లు, విజయవాడ, విశాఖపట్నం నుంచి ఓర్వకల్లుకు రైల్వే మార్గాన్ని అనుసంధానించాలని కోరారు. నగరంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ, రద్దీ నియంత్రణకు ఉపరితల వంతెలన ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, క్రిడాయి సలహ కమిటీ అధ్యక్షులు సాయిరాంరెడ్డి, ప్రతినిధులు జె.సురేష్‌కుమార్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ప్రకాష్, బ్రిజేష్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ గోశాలపై అసత్య ప్రచారాలు చేయవద్దు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కోట్లాది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీపై వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడటం తగదని మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం మంత్రి ఆవుల మరణాలపై భూమన వ్యాఖ్యలను ఖండించారు. తితిదే పవిత్రతను కాపాడేందుకు ఎన్డీయే ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. భూమన కరుణాకర్‌రెడ్డి అవాస్తవాలను ప్రచారం చేయ్యడం మంచిది కాదన్నారు. గోశాలలోని ఆవులు వృద్ధాప్యం, డెలివరీ సమయంలో వ్యాధులతో నెలకు సగటున 10 ఆవులు వరకు మృత్యువాత పడుతుంటాయన్నారు. ఇది గత ఐదేళ్ల గణాంకాలు చూస్తే స్పష్టంగా తెలుస్తుందన్నారు. టీటీడీ గోశాలలో 260 మందికి పైగా ఉద్యోగులు పని చేస్తూ గోవుల సంరక్షణకు సక్రమంగా చూసుకుంటున్నారని పెర్కొన్నారు. కోటి మంది దేవతలతో సమానంగా భావించే గోమాతలపై కూడా అసత్య ప్రచారం చేస్తూ టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు కుట్రలు చెయ్యవద్దని వైసీపీ నాయకులకు విజ్ఞప్తి చేశారు.

విద్వేషాలు రెచ్చగొట్టేందుకు భూమన కుట్ర

● టీటీడీ గోమరణాలపై తప్పుడు ప్రచారం
● పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత


మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత

కల్లూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం గోశాలలో గోమరణాలపై వైసీపీ నేత భూమన కరుణాకరరెడ్డి అసత్య ప్రచారాలు చేస్తూ విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఎమ్మెల్యే గౌరుచరిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గౌరుచరిత మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా టీడీపీపై భూమన కరుణాకరరెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నాడని విమర్శించారు. గోశాలలో వంద ఆవులు చనిపోయాయని చేస్తున్న ఆరోపణలు అవాస్తమని, వృద్ధాప్యం, డెలివరీ సమయంలో, వ్యాధులతో కొన్ని ఆవులు మృత్యువాత పడటం సహజమేనన్నారు. గోసంరక్షణపై టీటీడీ ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షణ సాగిస్తుందని దాదాపు 260 మంది సంరక్షకులు పనిచేస్తున్నారని తెలిపారు. గోశాలలో రికార్డులు లేవంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని జనన, మరణ రిజిస్టరు గోసంరక్షణశాలలో ప్రతిరోజూ క్రమం తప్పకుండా నమోదు చేస్తారని స్పష్టం చేశారు. వైసీపీ నేత భూమన కరునాకరరెడ్డి నాస్తికుడని ఆయన టీటీడీ ఛైర్మన్‌గా పనిచేసిన సమయంలో ప్లాస్మా, టీవీల కుంభకోణం, తాళిబొట్ల కుంభకోణం, టికెట్లు అమ్ముకోవడం, డాలర్లుమాయం చేయడం వంటి దుశ్చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. టీటీడీలో లడ్డూలను కల్తీ చేసిన వ్యక్తులు గోసంరక్షణ శాలపై తప్పుడు ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

● ఉపాధ్యాయులందరూ కృషి చేయాలి
● యూటీఎఫ్ జిల్లా కార్యాలయం ప్రారంభం


యూటీఎఫ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని అందుకు ఉపాధ్యాయులందరూ పోరాడాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. యూటీఎఫ్ కర్నూలు జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం యూటీఎఫ్ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. ముందుగా సీ.క్యాంపు సెంటర్ నుంచి యూటీఎఫ్ భవన్ వరకు ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం యుటీఎఫ్ భవనం వద్ద యూటీఎఫ్ పతాకాన్ని రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్ఈపీ ప్రశ్నించే తత్వం లేకుండా చేస్తుందన్నారు. పాలకవర్గ ప్రయోజనాల కోసమే విద్యారంగంలో సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ఉపాధ్యాయులంటే పాఠాలు చెప్పేవారే కాకుండా ఇతర పనులుచేసే వారిగా మార్చేశారన్నారు. తాము అధికారంలోకి వస్తే జీవో.117ను రద్దు చేస్తామని పాదయాత్రలో నారా లోకేశ్ హామీ ఇచ్చారని, దీనిని రద్దు చేయకుండా ప్రత్యామ్నాయం కోసం కసరత్తు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ బడిని కాపాడుకుంటేనే నైతిక రాజ్యాంగ విలువలు ఉంటాయన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగుల్లో 20 శాతం మందికే ప్రయోజనాలు అందుతున్నాయని అన్నారు. బకాయిలు అన్ని ఇచ్చా, పీఆర్‌సీ ఇస్తే బావుంటుందని చెబుతున్నారని, అది పీఆర్‌సీని ముందుకు వాయిదా వేయడమేనన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జయచంద్రారెడ్డి, లక్ష్మిరాజా, కర్నూలు జిల్లా అధ్యక్షులు రవికుమార్, నవీన్ పాటి, పూర్వ గౌరవాధ్యక్షులు నరసింహులు, ఎంవీ రమణయ్య, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

క్యాన్సర్‌కు ఆధునిక వైద్యం అందుబాటులో ఉంది

● మహిళల్లో క్యాన్సర్‌ను ముందే గుర్తించాలి
● కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్



కేఎంసీ ప్రిన్సిపాల్‌ను సత్కరిస్తున్న వైద్యులు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌కు ఇప్పుడు అత్యాధునిక వైద్యం అంధుబాటులో ఉందని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ పేర్కొన్నారు. ఓమేగా హాస్పిటల్, ఐఎంఏ కర్నూలు బ్రాంచ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఐఎంఏ భవన్‌లో మహిళల్లో వచ్చే క్యాన్సర్‌పై అవగాహన సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళల్లో ఎక్కువగా రొమ్ము, గర్భాశయ ముఖద్వారం, అండాశయ క్యాన్సర్లు అధికంగా వస్తున్నాయన్నారు. మహిళల్లో వచ్చే క్యాన్సర్లు ముందే గుర్తిస్తే నయం చేయవచ్చునన్నారు. కనీసం రోజు అరగంటసేపు వ్యాయామం చేయాలని భోజనం కొవ్వు శాతం తక్కువగా ఉన్న ఆహారం తీసుకుంటే క్యాన్సర్‌లను దూరంగా చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ కర్నూలు బ్రాంచ్ అధ్యక్షుడు డా.రామచంద్రానాయుడు, కోశాధికారి డా.మాధవి శ్యామల, ఓమేగా హాస్పిటల్ డైరెక్టర్లు డా.వెంకట్రామిరెడ్డి, డా.రవీంద్రబాబు, డా.ఉమామహేశ్వర రెడ్డి, డా.సుధీర్,కర్నూలు, గుంటూరు, హైదరాబాదు, విశాఖపట్నం చెందిన క్యాన్సర్ నిపుణులు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న ఎంపీ, భక్తులు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పాతనగరంలోని పేట శ్రీరామాలయంలో కొనసాగుతున్న ఆలయ శతాబ్ది బ్రహ్మోత్సవాలు రెండో రోజు ఆదివారం స్వామివారికి గజవాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరై పూజలు చేసి ఊరేగింపును ప్రారంభించారు. కార్యక్రమంలో సామాజిక వేత్త కేసీ కల్కూర, వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మాళిగి భానుప్రకాష్, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జరిగిన దేవాలయాల రక్షణ సదస్సులో అర్చక పురోహితులు గౌరిపెద్ది కృష్ణమూర్తి, కందాల రామాచార్యులు, శ్యాంసుందర్‌శర్మ, మహనంది రామాలయం అర్చకులు కిషోర్, రామాలయం ప్రధాన అర్చకుడు మాళిగి హనుమేషాచార్య, అనంత రాఘవేంద్రమూర్తి పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐలు

కర్నూలు క్రైం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా రౌడీ షీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని సీఐలు, ఎస్ఐలు రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిపించి పలు హెచ్చరికలు జారీ చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. నేరప్రవృత్తికి స్వస్తి పలకాలని సూచనలు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. అలాగే శరీన్‌నగర్‌లో డ్రైం కెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. పలు పార్కులు, ప్రభుత్వ పాఠశాలల మైదానాలను తనిఖీలు చేశారు.

ఘనంగా మట్టల ఆదివారం


మట్టలతో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నగరంలో మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. కోల్స్ సెంటీరియల్ చర్చిలో చిన్నారులు మట్టలను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. సీసీ చర్చి, సండే స్కూల్ అధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపరింటెండెంట్ దేవ మనోహర్‌రాజు మాట్లాడుతూ ఏసుక్రీస్తు జెరుషలేంలో జయప్రవేశం సందర్భంగా మట్టల ఆదివారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సుధీర్ జార్జ్, సామ్‌సంగ్‌పాల్, ఆర్.ప్రమోద్, పాస్టర్ జీ.రవికుమార్, మధుకర్, మనోహర్ పాల్గొన్నారు.

సి. బెళగల్: క్రైస్తవులు మట్టలఆదివారం పురస్కరించుకుని ఆదివారం తెల్లవారు జామున ఈతమట్టలను పట్టుకుని గామ పురవీధులలో భక్తిగీతాలు పాడుతూ భజన చేశారు. అలాగే మండలంలోని కంబందహాల్, గుండ్రేవుల, ఇనగండ్ల, పోలకల్లు, సంగాల, కొత్తకోట, శింగవరం, ఈర్లదిన్నె, ముడుమాల, చింతమానుపల్లె, బురాన్‌దొడ్డి, మారందొడ్డి, తిమ్మనదొడ్డి, బ్రాహ్మణదొడ్డి గ్రామాలలో క్రైస్తవులు మట్టల అదివారాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో పాస్టర్లు సురేష్, సాలమోన్, సంఘపెద్దలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి

కర్నూలు క్రైం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి డ్రోన్ కెమెరాలను వినియోగించి ట్రాఫిక్ పరిశీలన చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు. ఆదివారం సాయంత్రం ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ట్రాఫిక్‌ను పరిశీలించారు. నిబంధనలు పాటించని వారిని, ఓవర్ స్పీడ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్‌లు గుర్తించి జరిమానాలు విధిస్తున్నామని తెలిపారు. ప్రధాన సర్కిళ్లతో పాటు ట్రాఫిక్ రద్దీ ఉన్న ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రధాన రహదారులు కూడళ్లు, కాలనీల్లో వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రధాన దృష్టి సారిస్తున్నామన్నారు.

'సెస్ నిధులు గ్రంథాలయాలకు వినియోగించాలి'

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి సెస్ రూపంలో వసూలు చేస్తున్న నిధులు గ్రంథాలయాల పురోభివృద్ధికి వినియోగించాలని ఏపీ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక కన్వీనర్, ప్రముఖ కవి వల్లూరు శివప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఎస్టీయూ భవన్‌లో, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. అరసం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో వల్లూరు శివప్రసాద్ మాట్లాడారు. ఈ సదస్సునకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయ అభిమానులు, సాహిత్యాభిమానులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా పాల్గొన్న కేసీ కల్కూర, జేఎస్ఆర్‌కే శర్మ, డాక్టర్ ఎం. హరికిషన్, మారుతి పౌరోహితం, ఎస్‌డీవీ అజీజ్, డీఎస్పీ మహబూబ్ బాషా, ప్రమోద్ చక్రవర్తి, రాణి లీలావతి, చంద్రమౌళిని తదితరులు పాల్గొన్నారు.

పూలే చరిత్ర సినిమాను విడుదల చేయాలి

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే చరిత్రను యధాతథంగా వాస్తవ సినిమాను రీలీజ్ కాకుండా అడ్డుకోవడాన్ని ఖండిస్తున్నామని ఎస్సీఎస్టీబీసీ మైనార్టీ హక్కుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి అన్నారు. ఆదివారం నగరంలోని ఆసంఘం కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరీతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తక్షణమే సినిమాను రీలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. విడుదల చేయని పక్షంలో బహుజనులు ఏకమై పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఘనంగా కోన వెంకటేశ్వరస్వామి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

సి.బెళగల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్ణదొడ్డి గ్రామములో కొండపై వెలసిన కోనవెంకటేశ్వరస్వామి రథోత్సవము ఆదివారం తెల్లవారుజామున ఘనంగా నిర్వహించారు. స్వామివారి రథోత్సవారి రథోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూల నుండి భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుకుండా కోడుమూరు సీఐ తబ్రేజ్, కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు, గూడూరు ఎస్ఐ తిమ్మయ్య, ఎస్ఐ తిమ్మారెడ్డి పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

12వ పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించాలి



ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించి ఆరు నెలల్లోపు రిపోర్టు తెప్పించుకోవాలని, ఈలోపు ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులు, పెన్షనర్లతో చర్చించి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు గోకారి డిమాండ్ చేశారు. ఆదివారం సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పదవీ విరమణలు పొందుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57 ప్రకారం 2004 కన్నా ముందు నోటిఫికేషన్ విడుదలై అనివార్య కారణాల వలన ఆ తర్వాత నియమితులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. ఏప్రిల్, మే నెలలో జరిగే బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా జరపాలని తెలిపారు. కార్యక్రమంలో శేఖర్, రామాంజనేయులు, సురేష్, ధనుంజయ, వెంకట్రాముడు పాల్గొన్నారు.

చిన్నటేకూరులో చలివేంద్రం ఏర్పాటు

కల్లూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని జనసేన ఉమ్మడి జిల్లా కో-ఆర్డీనేటర్ చింతా సురేష్ అన్నారు. ఆదివారం కల్లూరు మండలం చిన్నటేకూరులో జనసేన మండల అధ్యక్షుడు బజారన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్, టీడీపీ మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు, వాల్మీకీ కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్, జనసేన నాయకులు వీబీవీ.సుబ్బయ్య, రామచంద్రుడు, లక్ష్మన్న, హుస్సేన్, షబ్బీర్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హ్యాండ్ బాల్ లీగ్

● విజేతగా కల్లూరు సురేష్ జట్టు

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి లీగ్ పోటీల్లో కల్లూరు సురేష్ జట్టు కప్పు కైవసం చేసుకోగా. నాగ శ్రీనివాస్ జట్టు రన్నర్‌గా నిలిచారు. ఆదివారం స్థానిక బీ.క్యాంపు క్రీడా మైదానంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ అడ్వకేట్ శ్రీధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకుని కప్పులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు, హ్యాండ్‌బాల్ సంఘం క్రీడా ప్రతినిధులు ఎండి బాషా, చిన్న సుంకన్న శ్రీనివాస్, సురేంద్ర బడేసాహేబ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో రాణించాలి

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో 14, 15 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించాలని అడ్వకేట్, క్రీడాదాత జి.శ్రీధర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆదివారం ఏ.క్యాంపు క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన క్రీడాకారుల అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లవరం రామాంజనేయులు, రెడ్మి సంఘం ప్రతినిధులు మహబూబ్ సుభాని, చిన్న సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం కాల్పులు విరమించి, చర్యలకు చొరవ చూపాలి


మాట్లాడుతున్న విరసం రాష్ట్ర నాయకుడు పాణి

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వివిధ వర్గాల నుంచి వస్తున్న విజ్ఞప్తులకు అనుగుణంగా, కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆదివాసీలపై, ఉద్యమకారులపై చేస్తున్న కాల్పులను విరమించి, శాంతి చర్చలకు చొరవ చూపాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక నేతలు విజ్ఞప్తి చేశారు. ఆదివారం నగరంలోని బిర్లా కాంపౌండ్ సమీపంలోని డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి ఆసుపత్రిలోని జేవీవీ కార్యాలయంలో 'కాల్పుల విరమణ - శాంతి చర్చలు - ఆవశ్యకత' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సంఘీభావ వేదిక కన్వీనర్ అల్లాబకాష్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులు, ప్రజా సంఘాల నేతలు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేశారు. సమావేశంలో విరసం రాష్ట్ర నాయకుడు పాణి, ఎస్‌డీపీఐ పార్టీ ప్రతినిధి చాంద్‌బాషా, రాయలసీమ విద్యావంతుల వేదిక కోకన్వీనర్ భాస్కర్‌రెడ్డి, రైతుకూలీ సంఘం కార్యదర్శి సుంకన్న, కుల నిర్మూలన పోరాట సమితి కార్యవర్గ సభ్యుడు సుబ్బరాయుడు, డీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నం ఏసేపు, పౌర హక్కుల సంఘం మాజీ అధ్యక్షుడు రాజసాగర్, నాగేశ్వర ఆచారి, మధుసూదన శర్మ, ఎంఏ ఖాన్ తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలిపారు.

'వంట గ్యాస్ ధరలు పెంచడం అన్యాయం'

తుగ్గలి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వంటగ్యాస్ ధరలు పెంచడం అన్యాయమని మాజీ ఎంపీపీ భూలక్ష్మి, రామాంజనేయులు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అమీనాబాదులో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను రూ.50లు పెంచడంతో సామాన్య ప్రజలపై అదనపు భారం పడుతుం దన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధం

హొళగుంద, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ముద్దటామాగి గ్రామానికి వరిగడ్డితో వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీకి విద్యుత్ తీగలు తగలడంతో కాలిపోయింది.


కాలిపోతున్న వరిగడ్డి

బాధితుడు గొల్ల గోపాల్ కథనం మేరకు.. రూ.50 వేలు ఖర్చు పెట్టి వరిగడ్డి కొనుగోలు చేశాడు. మధ్యాహ్నం 12 గంటలకు కొగిలాతోట బ్రిడ్జ్ వద్ద ఉన్న వర బసవేశ్వరా ఆలయం వద్ద గడ్డికి విద్యుత్ తీగ తగలడంతో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ ఇంజన్‌ను వేరుచేశాడు. దీంతో గడ్డితోసహా ట్రాలీ కాలిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

కస్తూర్బా పాఠశాలలో ప్రవేశాలు

హాలహర్వి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ పద్మావతి తెలిపారు. 6వ గరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బాలికలు ఆన్‌లైన్‌లో లేదా పాఠశాలలో నేరుగా సర్టిఫికెట్లతో వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థినులకు హాస్టల్‌తో కూడిన విద్య అందిస్తామని చెప్పారు.

మీటింగ్ కట్ట పునరుద్ధరణ

● సొంత ఖర్చులతో చేయిస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు


ఎక్స్‌కవేటర్‌తో చేయిస్తున్న పనులు

పత్తికొండ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తేరుబజార్‌లో శిథిలావస్థకు చేరుకున్న మీటింగ్‌కట్ట పునరుద్ధరణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఈ మీటింగ్ కట్టలో నాడు స్వాతంత్ర్య సమర యోధులు ప్రసంగాలు చేశారు. స్వాతంత్ర్యానంతరం నాయకులు, సినిమా నటులు, కవులు, రచయితలు ఎందరో ఇదే వేదిక నుంచి ప్రసంగాలు చేశారు. మీటింగ్‌కట్టను పునరుద్ధరించాలని కాలనీవాసులు ఎమ్మెల్యే శ్యాంబాబుకు వినతిపత్రాన్ని అందించారు. స్పందించిన ఎమ్మెల్యే సొంతఖర్చులతో పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చారు. ఆదివారం టీడీపీ లీగల్‌సెల్ నాయకులు సురేష్‌కుమార్, కన్వీనర్ కడవల సుధాకర్, మైనార్టీ సెల్ నాయకుడు మీరాహుసేన్ పనులను ప్రారంబించారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం


విరాళం ఇస్తున్న నాగన్న కుటుంబ సభ్యులు

మద్దికెర, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో నిర్మిస్తున్న శ్రీకృష్ణుని ఆలయానికి గ్రామానికి చెందిన గంగన్న గారీ నాగన్న, నాగమ్మ దంపతులు రూ.1.11 లక్షల విరాళాన్ని ఆదివారం అందజేశారు. దాతలు రంగప్ప, రంగన్న, చిన్న రంగన్న, రఘురాముడు, పద్మావతి, రంగమ్మ మాట్లాడుతూ ఆలయ నిర్మాణంలో తమ పాత్ర ఉండాలనే విరాళం ఇచ్చామన్నారు.

'విద్యను దూరం చేస్తున్న ప్రభుత్వం'

ఆలూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉన్నత విద్య అందకుండా రాష్ట్ర ప్రభుత్వం చేస్తోందని వైసీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు రాజు అన్నారు. ఆదివారం మాట్లాడుతూ ఇంజనీరింగ్, డిగ్రీ, ఫార్మసీ, ఎంబీఏ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. రూ.3,900 కోట్ల బకాయిలు ఉండగా, ప్రభుత్వం రూ.1,300కోట్లు మాత్రమే విడుదల చేసిందన్నారు. మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి యువత పోరుతో నిరసన తెలిపిన అనంతరం విడుదల చేసిందన్నారు.

కన్నుల పండువగా లంకా దహనం


గజ్జెహళ్లిలో లంకా దహనం

హొళగుంద, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతులింగేశ్వర స్వామి జాతర సందర్భంగా రెండో రోజు లంకా దహనం చేసినట్లు సర్పంచ్ అరుబట్ల నాగమ్మ, గిరిమల్ల, పూజారి రామలింగ, ఆదివారం తెలిపారు. బాణ సంచా కాల్చారు, ఎస్ఐ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో పోలీ సులు బందోబస్తు నిర్వహించారు.

టీడీపీలో కార్యకర్తలకు భరోసా

మద్దికెర, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో ప్రతి కార్యకర్తకు భరోసా ఉంటుందని టీడీపీ జిల్లా సాధికారిత కన్వీనర్ మూలింటి రంగస్వామి, నాయీ బ్రాహ్మణ సం ఘం నాయకులు మంగలి రంగస్వామి, నరేంద్ర అన్నారు. ఆదివారం పెరవలి గ్రామంలో సభ్యత్వాల కార్డులను పంపిణీ చేశారు.


సభ్యత్వ కార్డులు ఇస్తున్ననాయకులు

ప్రమాదమైనా తప్పదు

● హాలహర్వి నుంచి కర్ణాటకకు వెళ్తున్న కూలీలు
● ఒక్కో ఆటోలో 40 మంది వరకు ప్రయాణం
● మండలంలో ఉపాధి పనులు కల్పించని అధికారులు


ట్రాలీ ఆటోలో ప్రమాదకరంగా వెళుతున్న కూలీలు



హాలహర్వి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అత్యంత వెనకబడిన మండలం హాలహర్వి. ఇక్కడ 90శాతం మంది ప్రజలు కూలీలే. మండలంలో 10,392 జాబ్ కార్డులు ఉండగా సరిగా పనులు కల్పించలేదన్న ఆరోపణలు ఉన్నాయి. అరకొరగా పనులు కల్పించడంతో వెయ్యి మంది కూడా పనులకు రావడం లేదు. గ్రామాల్లో ఉపాధి పనులపై అవగాహన కల్పించడం లేదు. ఉపాధి విషయమై ఉన్నతాధికారులు స్థానిక అధికారులపై ఒత్తిడి చేయడంతో మండల స్థాయి అధికారులు అధిక మంది కూలీలు వస్తున్నట్లు ఉన్నతాధికారులకు బోగస్ నివేదికలు పంపుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

రోజుకు రూ.250 కూలి

తీరా అంతదూరం వెళ్లాక అక్కడ రోజుకు రూ.300లు మాత్రమే ఇస్తున్నారని, ఇందులో ఆటోకు రూ.50లు వెళుతుండటంతో తమకు రూ.250లు మాత్రమే మిగులుతోందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న ఊర్లేనే తమకు ఉపాధి పనులు కల్పించాలని, గిట్టుబాటు కూలీ అందేలా చూడాలని కోరుతున్నారు.

కిలోమీటర్ల దూరం వెళుతున్న కూలీలు

స్థానికంగా పనులు లేక పోవడంతో కూలీలు తప్పని పరిస్థితుల్లో కూలీలు ట్రాలీ ఆటోల్లో దూర ప్రాంతాలకు వెళుతున్నారు. ఒక్కో ఆటోలో 40మంది వరకు ప్రయాణిస్తున్నారు. ఏ మాత్రం అదుపు తప్పినా ప్రమాదం చేటుచేసుకున్నా కూలీల ప్రాణాలకే ప్రమాదం.



వెళ్లక తప్పడం లేదు

మాది రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలు. ఇక్కడ పనులు లేకపోవడంతో ఆటోలో కర్ణాటకలో మిరప కోతలకు వెళుతున్నాం. చాలామంది ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా తప్పడం లేదు. ఊర్లోనే అధికారులు ఉపాధి పనులు కల్పించాలి. - పకీరమ్మ, గూళ్యం.

ఉపాధి పనులు కల్పిస్తాం

ప్రతి కుటుంబానికి ఉపాధి పనులు కల్పిస్తాం. గ్రామాల్లో దండోరా వేయించి సమావేశాలు ఏర్పాటు చేస్తాం. కూలీలకు గిట్టుబాటు వేతనం అందేలా చూస్తాం. - పక్కీరప్ప, ఏపీడీ, ఆలూరు

అమలుకాని ప్రభుత్వ ఆదేశాలు

టీడీపీ ప్రభుత్వం ఉపాధి పథకంలో అవినీతికి తావు లేకుండా మేటి వ్యవస్థను తీసుకువచ్చింది. ప్రతి గ్రామంలో శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర స్థాయి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కానీ ఇక్కడ అవి అమలు కావడం లేదని ఆరోపణలు ఉన్నాయి. 380 శ్రమశక్తి సంఘాలు ఏర్పాటు కావాల్సి ఉండగా, అధికారులు కేవలం 73మంది మేటీలను నియమించి మమ అనిపించారు.

హోసన్నా.. ప్రభువైన యేసుకు జయం

● భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం


ఆదోని రాయనగర్‌లో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు


దేవనకొండ మండలం తెర్నేకల్లులో ర్యాలీ..

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. విక్టోరియా పేట సీఎస్ఐ చర్చ్, ఎస్‌కేడీ కాలనీ హోలీ ట్రినిటీ చర్చ్, రాయనగర్ ఎంబీటీ చర్చి, రాయనగర్ క్రైస్ట్ రిఫామ్ (సీఆర్) చర్చి, మండగిరి ఆర్‌సీఎం చర్చిలో ఉదయం ఖర్జూరపు (ఈత) మట్టలు చేత పట్టుకొని క్రైస్తవులు హోసన్నా, ప్రభువైన యేసుకు జయం అంటూ ర్యాలీ నిర్వహించారు. సీఎస్ఐ చర్చి పాస్టర్ రెవరెండ్ విలియం సుజిత్ మాట్లాడుతూ ప్రభువైన యేసుక్రీస్తు సిలువలో మరణించక మునుపు గుడ్‌ఫ్రై డే ముందు ఆదివారం యెరుషలేములోకి ప్రవేశించినప్పుడు హోసన్నా జయం, జయం అని, ప్రభువు పేరిట వచ్చు రాజు స్తుతింపబడును గాక అని ప్రజలు స్వాగతం పలికారన్నారు. యేసుక్రీస్తు సిలువలో మానవుల పాపపరిహారార్థం మరణించి మూడోరోజు తిరిగి లేచారని తెలిపారు. మండగిరి క్యాథలిక్ చర్చి పాస్టర్ రెవరెండ్ కోలా విజయరాజు, సీఆర్ చర్చి పాస్టర్ బ్రదర్ తిమోతి, పాస్టర్ ఎమ్మోస్ రావు, సంఘపెద్దలు సునీల్ రాజ్‌కుమార్, శ్రీకాంత్, డేవిడ్, విల్సన్ పాల్గొన్నారు.

దేవనకొండ: తెర్నేకల్ గ్రామం ఏబీఎం చర్చిలో రెవ.సాదోక్ మోరిస్ అధ్వర్యంలో మట్టాల ఆదివారం నిర్వహించారు. టీచర్లు సతీష్‌కుమార్, షాలేం రాజు, హోసన్న, అజయ్, గ్రామ సర్పంచ్ అరుణ్‌కుమార్, పులినరేష్ పాల్గొన్నారు.

ఆలూరు: కొట్టాల గ్రామంలో గుడ్‌ఫ్రైడేకు ముందు వచ్చే మట్టాల ఆదివారాన్ని క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. సీఎస్ఐ చర్చి పాస్టర్ రెవ. పుస్తెల కుమార్, సంఘ పెద్దలు దేవపుత్ర, ఆర్కేవిక్రం బాబు, ఆశీర్వాదం, ఆనందు దానప్ప, ధర్మన్న, రాజు, యవనస్థులు ఎస్ బెన్నీ పి.ప్రసాద్, సురేష్ బాబు, ఇమ్మానియేల్, భాస్కర్, సంఘ కాపరులు సత్యానందం, భాస్కర్, స్త్రీలు పాల్గొన్నారు

ఇంటర్ ఫలితాల్లో సత్తా


ఎల్లప్ప, సునీత, బసవరాజు, సంపత్ కుమార్

ఆలూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఆలూరు విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. మోడల్ స్కూల్ ఎంపీసీ విద్యార్థి ఎల్లప్ప నాయుడు 953 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. కస్తూర్బా విద్యార్థిని సునీత 916 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచినట్లు ఎస్‌వో సునీత తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపీసీ విద్యార్థి బసవరాజు 908 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలచాడని ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. అరికెర డా బీఆర్ అంబేద్కర్ గురుకులం సీఈసీ విద్యార్థి సంపత్ కుమార్ 895 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ మనోరాజు తెలిపారు.

బీపీ మండల్ సేవలు చిరస్మరణీయం

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బీసీ కమిషన్ చైర్మన్ బిందేశ్వరి ప్రసాద్ మండల్ సేవలు చిరస్మరణీయమని బీసీ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు అన్నారు. ఆదివారం కార్యాలయంలో మండల్ వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు. కత్తి హనుమంత రావు, శేషన్న వీరభద్ర, నల్లారెడ్డి, వెంకటేశ్వరులు, ప్రకాష్, దీపక్ తాయప్ప, ఆనంద్ పాల్గొన్నారు.

హోరా హోరీగా పోటీలు

ఆలూరు రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హత్తిబెళగల్ గ్రామం సోమేశ్వర స్వామి రథోత్సవాల్లో ఆదివారం ఎద్దుల బండి గిరక పోటీలు హోరాహోరీగా సాగాయి. బాగమ్మ గారి కురవ శీన ఎద్దులు మొదటి స్థానంలో నిలవగా 10 తులాల వెండిని హత్తిబెళగల్ టీడీపీ నాయకులు మిత్ర వీరాంజినేయులు, మంజునాథ్ అందించారు. ఊరి వాకిలి సోమలింగ ఎద్దులు రెండవ బహుమతిని రూ.5తులాల వెండిని బహుమతి అందించారు. కె దేవేంద్ర, మూర్తి. కె శ్రీనివాసులు, డీలర్ గురుస్వామి, రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా ఫక్కీరప్పస్వామి రథోత్సవం


మద్దికెర మండలం ఎం.అగ్రహారంలో రథోత్సవం

మద్దికెర, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అగ్రహారం గ్రామ శివారులో వెలసిన ఫక్కీరప్పస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం ఉదయం ఆకుపూజ, కుంకుమార్చన ప్రత్యేక పూజలు చేసి మహా మంగళహారతులు ఇచ్చారు. మధ్యా హ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఫక్కీరప్పస్వామి విగ్రహాన్ని రథంపై ఉంచి రథోత్సవం నిర్వహించారు. భక్తులు అరటిపండ్లను రథంపై విసిరి భక్తిని చాటుకున్నారు. రాత్రి భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్ఐ విజయకుమార్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ధర్మకర్త రిత్విక్ రెడ్డి, పెద్ద ఎత్తున గ్రామప్రజలు, భక్తులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కమిటీ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, కమిటిదే తుది నిర్ణయం అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, టీడీపీ నాయకులు మధుబాబు, మాజీ ఎంపీపీ భూలక్ష్మి, రామాంజనేయులు, సతీష్ చౌదరి, ఉన్నారు.

అభయాంజనేయ స్వామి రథోత్సవం

తుగ్గలి: మండలంలోని అమీనాబాదులో ఆదివారం హనుమాన్ జయంతిని పురస్కరిం చుకుని అభయాంజనేయస్వామి రథోత్సవం నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి, మధ్యాహ్నం అన్నదానం చేశారు. అనంతరం అశేషజనవాహిని మధ్య రథోత్సవాన్ని నిర్వహించారు.

కనుల పండువగా రథోత్సవం

వెల్దుర్తి: రామళ్లకోటలో వనం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం ఆదివారం కనుల పండువగా సాగింది. అంతకు ముందు ఉత్సవమూర్తులకు పురోహితులు ప్రత్యేక పూజలు చేశారు.

బండలాగుడు విజేత వెంకటేశ్వరరావు వృషభాలు

వెల్దుర్తి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గోవర్ధనగిరిలో ఆదివారం న్యూ కేటగిరి ఎద్దుల బండలాగుడు పోటీలను పూజారి బద్దెలపుల్లయ్య ప్రారంభించారు. నాగర్ కర్నూల్ జిల్లా, చంద్రకళ గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు వృషభాలు విజేతగా నిలిచి రూ.50వేలు నగదు బహుమతి అందుకున్నాయి. నారాయణపేట జిల్లా, జకిలేరు గ్రామానికి చెందిన రషీద్ వృషభాలు రెండవ స్థానం సాధించి రూ.40వేలు, నంద్యాల జిల్లా ఎన్ కొత్తపల్లి గ్రామానికి చెందిన వెంకటహారిక వృషభాలు మూడవ స్థానం సాధించి వాఖ్యతగా అబ్దుల్ కలామ్, కోకిల మహేశ్‌కుమార్‌లు వ్యవహరించారు.

వైభవంగా సోమేశ్వర స్వామి రథోత్సవం

ఆలూరు రూరల్: హత్తిబెళగల్ గ్రామ కొండపై వెలసిన సోమేశ్వర స్వామి వసంతోత్సవం ఆదివారం నిర్వహించారు. ఉదయం పంచామృతశేకం. పుష్పాలంకరణ, మహామంగళ హరతి చేశారు. ఉత్సవమూర్తులను వీధుల్లో ఊరేగించి, భక్తులు రంగులు చల్లుకున్నారు.

మాళ మల్లేశ్వర స్వామికి పూజలు

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామికి ఆదివారం పూజలు నిర్వహించినట్లు పూజారులు మహేష్ స్వామి ఆదివారం తెలిపారు. తెల్లవారుజాము నుంచి మహా మంగళహారతి, ఆకుపూజ, రుద్రభిషేకం నిర్వహించారు.

పార్టీ బలోపేతానికి కృషి


వీరభద్ర గౌడ్‌తో మాట్లాడుతున్న నారాయణ

ఆలూరు , ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి కృషి చేద్దామని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గుమ్మనూర్ నారా యణ అన్నారు. ఈ మేరకు ఆదివా రం టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్‌ను కలిశారు. వర్గాలకు అవకాశం లేకుండా ప్రభు త్వంఅమలు చేస్తున్న పథకాలను ప్రజలకు అందేలా చూద్దామని చర్చించుకున్నారు. నాయకులు రఘుప్రసాద్ రెడ్డి, అట్టికల్ జగన్, మోహన్ బాబు ఉన్నారు.

తాటి ముంజలకు డిమాండ్

హొళగుంద, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతుండటంతో ప్రజలు తాటిముంజలను ఆశ్రయిస్తున్నారు. దీంతో వీటికి డిమాండ్ పెరిగింది. వీటితో శరీరానికి కావాల్సిన పోషకాలు లభిస్తుండటంతో కొనేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. హొళగుంద బస్టాండులో కొందరు యువకులు తాటిముంజలను డజను రూ.50ల చొప్పున విక్రయిస్తున్నారు. రోజుకు వంద డజన్లకు పైగా అమ్ముతున్నామం టున్నారు.


తాటి ముంజలు తీస్తున్న వ్యాపారి

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

ఆస్పరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాటకల్లు గ్రామానికి చెందిన వీరేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు అయింది. సీఐ మస్తాన్‌వలి తెలిపిన మేరకు.. నిందితుడు అదే గ్రామానికి చెందిన ఈరప్పపై ఆదివారం తెల్లవారు ఝామున దాడిచేశాడు. వీరేష్‌పై 2011లో ఈరప్ప కత్తితో దాడి చేయడంతో దాన్ని మనసులో ఉంచుకొని వీరేష్ ప్రతీకార దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

జయప్రదం చేయండి

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మే డేను జయప్రదం చేయాలని ఏఐటీయుసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి కృష్ణయ్య, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రంగన్న పిలుపునిచ్చారు. ఆదివారం సీఆర్ భవన్‌లో మాట్లాడుతూ 8 గంటల పనిదినాల కోసం ఆనాడు కార్మికులు చిందించిన రక్తతర్పణ రోజే మేడే అని గుర్తు చేశారు. నెట్టికంటయ్య, రామచంద్ర, రాజప్ప, రంగన్న, సుంకమ్మ, కాంతమ్మ, సోమశేఖర్, పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

తుగ్గలి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి హరిత సూచించారు. ఆదివారం పగిడిరాయి వైద్యశాలలో రోగులతో మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మధ్యాహ్నం వేళ ఆరుబయట తిరగవద్దని సూచించారు.

ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

● మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి ధ్వజం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

మద్దికెర, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో ఘోరంగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆరోపించారు. ఆదివారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అమలు చేయలేని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. సూపర్ సిక్స్‌ను ఇంత వరకు అమలు చేయలేదన్నారు. పత్తికొండ తాలుకాలో కేవలం మూడు మండలాలు మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించి మరో రెండు మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించలేదని ఆరోపించారు. మాజీ సీఎం, వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజల తరుపున పోరాటం చేయడానికి సిద్దంగా ఉన్నారన్నారు. రైతులు కరువు కాటకాలతో అల్లాడుతున్నా, ప్రభుత్వ సాయం అందడం లేదన్నారు. సమావేశంలో సర్పంచ్ బురుజుల విజయుడు, మండల వైసీపీ అధ్యక్షులు మల్లికార్జున యాదవ్, పత్తికొండ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఫక్కీరప్ప, వైసీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● ఆలూరు ఎంపీడీవో మహబూబ్ బాషా



ఆలూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూస్తామని ఆలూరు ఎంపీడీవో మహబూబ్ బాషా అన్నారు.

ప్రశ్న: మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు: ఆలూరు పట్టణంలో వాటర్‌మెన్లతో తాగునీటి సరఫరాలో అంతరాయం కలిగింది. వాటర్ మెన్లతో సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరిస్తాం. పొత్తికొండ ఆర్డీవో ఇందుకోసం హెల్ప్ లైన్ ఏర్పాటు చేశారు. అసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తాం.

ప్రశ్న: ఆలూరులో గ్రీన్ పార్క్ ప్రతిపాదన ఎంతవరకు వచ్చింది?

జవాబు: 2018లో గ్రామ పంచాయతీ ఇచ్చిన తీర్మానం చేసింది. ఉన్నత దృష్టికి తీసుకెళ్లి మంజూరు అయ్యేలా చూస్తాం.

ప్రశ్న: బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరు ప్రక్రియ ఎంత వరకు వచ్చింది?

జవాబు: మండలంలో బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం ఇంటర్వ్యూలు పూర్తి చేశాం. వారంలోగా అభ్యర్థును ఎంపిక చేస్తాం.

ప్రశ్న: బీసీ మహిళలకు కుట్టు మిషన్లలను ఎప్పుడు పంపిణీ చేస్తారు?

జవాబు: మండలంలో కుట్టు మిషన్ల కోసం 578 మంది బీసీ మహిళలు దరఖాస్తు చేశారు. వారికి థర్డ్‌పార్టీ ద్వారా శిక్షణ ఇచ్చిన తర్వాత అర్హులైన వారికి ఉచితంగా కుట్టు మిషన్లు ఇస్తారు.

ప్రశ్న: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షిస్తున్నారా?

జవాబు: ప్రభుత్వ సూచన మేరకు బోజనాన్ని తహసీల్దార్ ఎంఈవోతో పాటు ఎంపీడీవోతో కలిసి త్రీమెన్ కమిటీ పర్యవేక్షణ చేయాల్సి ఉంది. ఇక నుంచి తప్పకుండా తనిఖీలు చేసి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందేలా చూస్తాం.

వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలి: సీపీఐ



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మంత్రాలయం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బినామి పేర్లతో వక్ఫ్ బోర్డు భూములను దోచుకున్న ఎంపీలు, ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుని వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం ముస్లింలతో కలిసి పరమాన్‌దొడ్డి తండా బస్టాండు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వక్ఫ్ భూములను కొంత మంది ప్రజాప్రతినిధులు బినామీ పేర్లతో తీసుకుని ఇతరులకు సాగుకు ఇచ్చి ఆదాయాన్ని పొందుతున్నారని ఆరోపించారు. అసలైన ముస్లింలకు పెద్ద ఎత్తున నష్టం జరుగుతుందని వాపోయారు. రాజ్యాంగానికి విరుద్ధంగా బీజేపీ ప్రభుత్వం తన రాజకీయ బలంతో తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయకపోతే సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, ఈరన్న, పంపాపతిగౌడు, ఎల్లప్ప, మక్బూల్ బాషా, మాబాషా, షేక్షావలి, సలీం, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

బిర్యాని ఆకుపై అంబేడ్కర్ చిత్రం



అశోక్, చిత్రకారుడు, ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చిత్రకళాకారుడు అశోక్ చిన్నపాటి బిర్యాని ఆకుపై రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రంతో పాటు రాజ్యాంగ వజ్రోత్సవ చిత్రాలను గీసి అబ్బురపరిచారు. అంబేడ్కర్ రాజ్యాంగం రచించి 75ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని వజ్రోత్సవాల ప్రతిమను చిత్రీకరించారు. అంతేగాక రాజ్యాంగంలో ఆడ మగకు సమాన హక్కులు, అంటరాని తనం నిర్మూలన కోసం చెరువులో నీరు తాగించటం, అంబేడ్కర్‌కు జనం నివాళులు అర్పించే వంటి చిత్రాలను బిర్యాని ఆకుపై చిత్రీకరించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా చిన్నపాటి ఆకుపై చిత్రాలను చిత్రీకరించానని చిత్రకారుడు అశోక్ తెలిపారు. కాగా చిత్రకారుడు అశోక్ గతంలో మహనీయుల చిత్రాలను, చింతపిచ్చుక, అగ్గిపెట్టే, రావి ఆకు, పుచ్చకాయలపై చిత్రీకరించి పలువురి ప్రశంశలను అందుకున్నారు.

బీసీ హాస్టల్‌లో మెనూ పాటించాలి

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): బీసీ హాస్టళ్లలో మెనూ పాటించాలని ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు విష్ణు, ఖాదర్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలన్నారు. విద్యార్థులకు సన్నబియ్యాన్ని పంపిణీ చేయాలన్నారు. హాస్టల్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో రమేష్, రవి, సురేష్, చిన్న పాల్గొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో కర్నూలు ఎస్పీ

మంత్రాలయం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ దంపతులు ఆదివారం సాయంత్రం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. వారికి మఠం జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి, వ్యాసరాజాచార్, దేశాయి నరసింహ ఆచార్‌లు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూలబృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పండితులు రాఘవేంద్రస్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేశ్ కోణాపూర్, అనంతపురాణిక్, సీఐ రామాంజులు, మంత్రాలయం,మాధవరం ఎస్ఐలు శివాంజల్, విజయ్‌కుమార్,లక్ష్మినారాయణ, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి బీవీతోనే సాధ్యం


జగ్గాపురంలో బోరును ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

నందవరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డితోనే సాధ్యమని టీడీపీ నాయకులు నరసింహులు, గట్టాల రంగన్న, తిమ్మప్ప అన్నారు. మండలంలోని జగ్గాపురం గ్రామంలో ఎమ్మెల్యే మంజూరు చేసిన నిధులతో ఏర్పాటు చేసిన తాగునీటి బోరును స్థానిక నాయకులు ప్రారంభించారు. గతంలో ఈ ప్రాంతవాసులకు తాగునీటి ఇబ్బంది అధికంగా ఉందని ఎమ్మెల్యే బీవీకి మొరపెట్టుకోగా, నిధులు మంజూరు చేసి బోరు వేయించారు. కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దస్తగిరి, రామాంజినేయులు, ఈరన్న, గోపాలు, నాయుడు, వీరేంద్ర పాల్గొన్నారు.

నీళ్ల చారే..!


పప్పు చారు

● కేజీబీవీలో మెనూ పాటించని నిర్వాహకులు
● ఎవరికీ చెప్పుకోలేని విద్యార్థినులు
● పెట్టింది తినండి.. తమాషాలు చేయొద్దంటున్న ప్రిన్సిపాల్

కోసిగి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తున్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో కోసిగి ప్రిన్సిపాల్ నిర్లక్ష్యానికి వరుసగా మూడు ఆదివారాలు విద్యార్థినులకు పప్పుచారుతోనే సరి పెట్టారు. గత మార్చి 30న, ఈనెల 6న, 13న ఆదివారం విద్యార్థినులకు పప్పు చారే వడ్డించారు. విద్యార్థినులు ఎవరికీ చెప్పుకోలేక పెట్టిందే తింటున్నారు. పెట్టిందే తినాలి.. తమాషాలు చేయొద్దు అంటూ ప్రిన్సిపాల్ బెదిరిస్తున్నారని కొందరు విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేజీబీవీ పాఠశాలలో మెనూ ప్రకారం ఆదివారం విద్యార్థినులకు చికెన్, అన్నం, మంగళవారం గుడ్డు, పెట్టాలి. అయితే.. మూడు ఆదివారాలుగా చికెన్ పెట్టలేదు. మంగళవారాల్లో సైతం గుడ్డును ఇవ్వడం లేదని విద్యార్థినులు వాపోతున్నారు. ఎవరికైనా చెబితే టీసీ ఇచ్చి ఇంటికి పంపిస్తామని బెదిరిస్తుండటంతో విద్యార్థినులు తల్లిదండ్రులకు, అధికారులకు చెప్పకుండా దిగమింగుతున్నారు. నిర్వాహకులు పెట్టిందే తిని సరిపెట్టుకుంటున్నారు. కొందరు విద్యార్థినులు ధైర్యం చేసి తల్లిదండ్రులకు చెప్పుకోవడంతో అసలు విషయం బయటపడింది. విద్యార్థినుల తల్లిదండ్రుల సమాచారం మేరకు ఆదివారం కేజీబీవీ పాఠశాలను 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేయగా.. విద్యార్థినులు ముద్ద అన్నం, పప్పు చారే తింటూ కనిపించారు. మెనూ ప్రకారం విద్యార్థినులకు భోజనం పెట్టకుండా వంట ఏజెన్సీలకు తాను చెప్పిన విధంగా వండాలని ఆర్డర్లు వేస్తుండటంతో చేసేదేమీ లేక ప్రిన్సిపాల్ చెప్పినట్లుగా విద్యార్థినులకు భోజనం పెడుతున్నారు. గతంలో 20 రోజుల పాటు ఉదయం రాగి మాల్ట్ కూడా ఇవ్వలేదని, పాలు, పెరుగులో కూడా సక్రమంగా ఇవ్వడం లేదని విద్యార్థినుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ప్రిన్సిపాల్ వారానికి మూడు రోజులు ఆఫీసు పని చెప్పి సక్రమంగా రావడం లేదని, ఒక్కరోజు కూడా నైట్ అల్ట్ చేసి విద్యార్థినులను చదివించడం లేదని తెలిపారు. జిల్లాస్థాయి అధికారులు కోసిగి కేజీబీవీలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించేలా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇదే విషయాన్ని ప్రిన్సిపాల్ షబాన అజ్మీన్‌ను ఫోన్ లో వివరణ కోరగా.. పాఠశాలకు చికెన్ అందించే నిర్వాహకుడు అందుబాటులో లేడని, మంగళవారం అందిస్తామని చెబుతుండటం గమనార్హం. అయితే.. ప్రిన్సిపాల్ మాత్రం మంగళవారం రోజు విద్యార్థినులకు అందించాల్సిన గుడ్డు అందిస్తుందా లేదా..? తెలియాల్సి ఉంది.



ఆదివారం కూడా పప్పు చారు అన్నం భోజనం చేస్తున్న విద్యార్థినులు

విజేతలకు బహుమతి ప్రదానం


పోటీలను పూజ చేసి ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్

గోనెగండ్ల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రబాడు గ్రామంలో ఆదివారం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను చెన్నకేశవ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరాములు, వైస్ చైర్మన్ రోగిరాముడు, మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి ప్రారంభించారు. పోటీలకు పలు ప్రాంతాల నుంచి 20 ఎద్దుల జతలు పాల్గొన్నాయి. బండలాగుడు పోటీలను తిలకించేందుకు పలు ప్రాంతాల నుంచి జనం తరలివచ్చారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు సాయంత్రం బహుమతులను మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి, రోగి రాముడు ప్రదానం చేశారు. మల్యాల గ్రామానికి చెందిన షేక్ మైమూన్ ఎద్దులు ప్రథమ స్థానంలో నిలువగా యజమాని రూ.65వేలు అందుకున్నారు. అలాగే తాడిపత్రి ఎద్దులు రెండవ బహుమతి రూ. 45వేలు, హెచ్ కైరవాడి ఎద్దులు మూడవ బహుమతి రూ.35వేలు గెలుచుకున్నాయి. అలాగే ఆరు జతల ఎద్దుల యజమానులకు వరుస బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దేవేంద్రరెడ్డి, ప్రభాకర్‌నాయుడు, శివరామిరెడ్డి, అశోక్‌కుమార్, మదనగోపాల్, మాదన్న, బషీర్‌హమ్మద్, తిప్పనూరు శ్రీరామరెడ్డి, వేముగోడు నరేష్‌రెడ్డి, ఉరుకుందరెడ్డి, తిప్పనూరు నాగార్జున రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప స్వామి దేవర


కోసిగిలో బీరప్ప స్వామి దేవాలయం నుంచి ర్యాలీగా వెళ్తున్న కురువలు

కోసిగి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన బీరప్ప స్వామి దేవర పూజారి మల్లయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కురుబ కులస్థులు ఏడు దేవాలయాల పల్లకిలు గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమానికి కురువ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు గుడిసె శివన్న హాజరయ్యారు. ఈ ఉత్సవాలో మన రాష్ట్రంతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని కురుబ కులస్థులు వేల సంఖ్యలో పాల్గొన్నారు. బీరప్ప దేవాలయం నుంచి రేణుకా ఎల్లమ్మ ఆలయం వరకు విద్యుద్దీపాలతో అలంకరించారు.

అసత్య ప్రచారాలు చేయొద్దు

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి


మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): టీటీడీ గోశాలలో గోవులు మృతి చెందాయని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అసత్య ప్రచారాలు చేస్తూ మత విద్వేషాలు రెచ్చగొట్టేలా యత్నిస్తున్నారని టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. ఆదివారం మాధవరంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా టీటీడీపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అన్నారు. గోశాలలో వంద ఆవులు మృతి చెందాయంటూ ఆరోపణలు చేయడం అవాస్తవమని అన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు రమాకాంత్ రెడ్డి, ఉలిగయ్య, టిప్పు సుల్తాన్, పల్లెపాడు రామిరెడ్డి, బసల దొడ్డి ఈరన్న, అడివప్పగౌడు పాల్గొన్నారు.

● ప్రతి కార్యకర్తలకు అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటామని నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ రాఘవేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మాధవరం తన నివాసంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేష్, మాజీ జడ్పీటీసీ ఆర్ లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలకు టీడీపీ సభ్యత్వ కార్డులను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం


మంత్రాలయం మండలం మాధవరంలో మట్టలతో ఊరేగింపు చేస్తున్న క్రైస్తవులు

మంత్రాలయం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం, మాధవరం, రచ్చుమర్రి, మాలపల్లి, రాంపురం, చెట్నహళ్లి, సూగూరు, వగరూరు, తిమ్మాపురం గ్రామాల్లో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం జరుపుకున్నారు. సీఎస్ఐ డివిజినల్ చైర్మన్ రెవ. వేదనాయకం, జాన్‌వెస్లీ, ఎస్‌డీ రాజన్న, యేసయ్య ఆధ్వర్యంలో చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఈత మట్టలతో ఆధ్యాత్మిక క్రైస్తవ భక్తి పాటలు, డ్రమ్స్, తప్పెట్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో సంఘ నిర్వాహకులు భూపతి, తిమోతి, వినోద్, జగదీష్, పాలరాజు, మేకల తిమోతి, యోబు, ప్రభుదాసు, కుమార్, దేవదాసు, మరియప్ప, నరసింహులు, దానియేలు, రాజు పాల్గొన్నారు.

టీడీపీలోనే బీసీలకు పెద్దపీట


బీటీ నాయుడుని సన్మానిస్తున్న నాయకులు

కోసిగి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీలోనే బీసీలకు పెద్ద పీట అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం కర్నూలు జిల్లా పరిషత్ లో టీడీపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ బీటీ నాయుడును జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగి, కౌతాళం, పెద్దకడుబూరు, మంత్రాలయం మండలాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లి ఎమ్మెల్సీ బీటీ నాయుడును సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ నాయుడు, ఎల్లెల్సీ చైర్మన్ టిప్పుసుల్తాన్, రమాకాంత్ రెడ్డి, నాడిగేని అయ్యన్న, నాడి గేని చిన్నతాయన్న, బసలదొడ్డి ఈరన్న, వెంకటపతిరాజు, అడివప్పగౌడు, మాలపల్లి లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


వైసీపీ సీనియర్ నాయకులు బుట్టా నీలకంఠను సన్మానిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు,ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వైసీపీ సీనియర్ నాయకుడు బుట్టా నీలకంఠ అన్నారు. ఆదివారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల పట్టణ ఉపాధ్యక్షుడిగా నియమితులైన ఉప్పర కోటకొండ నరసింహులు, పట్టణ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కోరిశెట్టి విశ్వనాథ్‌లతో పాటు పదవులు పొందిన పలువురు నాయకులు బుట్టా నీలకంఠను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో అధిష్టానం పదవులకు ఎంపిక చేసిందన్నారు. అందరు కలిసి కట్టుగా పార్టీని బలోపేతం చేసేందుకు పాటుపడాలన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కామార్తి నాగేశప్ప, నాయకులు విశ్వనాథ్ రమేష్, కదిరికోట సునీల్, గువయి మాబాష, గడ్డం అంజి, రఘువీర, పాల శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్, మహబూబ్ బేగ్, షెక్ చాంద్, చంద్రశేఖర్ ఆచారి, తిమ్మాపురం బజారి, శ్రీనివాసు పాల్గొన్నారు.

భక్తుల కోలాహలం

మంత్రాలయం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం కోలాహలంగా మారింది. శని, ఆదివారం సెలవు దినాలు రావడంతో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అద్దె రూములు దొరకక మధ్వమార్గ్ కారిడార్ ముందే భక్తులు బసచేశారు. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్లు, పరిమళప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది.

పేరుకుపోయిన చెత్త


రాఘవేంద్రపురంలో రోడ్డుపైనే నిల్వ ఉండిన చెత్తాచెదారం

మంత్రాలయం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలోని రాఘవేంద్రపురంలో ప్రధాన రోడ్డు చెత్తాచెదారంతో పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ కాలనీలో దాదాపు వేయి కుటుంబాలకు పైగా నివసిస్తున్నారు. ఈ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిలో ఎంఆర్‌సీ భవనం సమీపంలో రోడ్డుపైనే చెత్తాచెదారం వేయడంతో పందులకు, పశువులకు, కుక్కలకు నిలయంగా మారింది. దీనిని తొలగించాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. అదేవిధంగా రోడ్లపై చెత్తాచెదారం, మురుకు కాలువలు నిండిపోయి దోమలకు నిలయంగా మారాయి. పంచాయతీ అధికారులు స్పందించి వెంటనే తొలగించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పేదింటి విద్యాకుసుమాలు

● వరుసగా మూడేళ్లు ఒకే ఇంటి నుంచి ముగ్గురు మండల టాపర్లు
● పదేళ్లుగా తల్లిదండ్రుల వలసబాట
● అవ్వా తాత దగ్గరుంటూ చదువుకుని ప్రతిభ చాటుతున్న విద్యార్థులు


అక్క, అన్నలతో కలిసి తమ్ముడు రాకేష్

కోసిగి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని పేదింటి విద్యాకుసుమాలు ఇంటర్ ఫలితాల్లో ప్రభంజనం సృష్టిస్తున్నారు. కోసిగిలోని 9వ వార్డు దుర్గానగర్‌కు చెందిన సూరపోగు ఈరేష్, సుజాత దంపతులు పదేళ్ల క్రితం వలస వెళ్లి బెంగుళూరులో ఉంటున్నారు. వీరికి ముగ్గురు సంతానం. ఝాన్సీ, లోకేశ్, రాకేష్‌లు వీరిని అవ్వా, తాతల వద్ద వదిలి తల్లిదండ్రులు వలస వెళ్లారు. వీరు కోసిగిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని కోసిగిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో వరుసగా మూడేళ్లుగా మండల టాపర్లుగా నిలిచి శభాష్ అనిపించుకుంటున్నారు. 2022-23 ఇంటర్ ఫలితాల్లో ఎస్.ఝాన్సీ బైపీసీలో 868 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. 2023-24లో ఎస్.లోకేశ్ బైపీసీలో 964 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. 2024-25లో ఎస్.రాకేష్‌లో బైపీసీ 948 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. వరుసగా మూడేళ్లు అక్క, అన్న, తమ్ముడు మండల టాపర్లుగా నిలవడంపై ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, కళాశాల సిబ్బంది, కోసిగి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

క్యాన్సర్‌తో బాధపడుతూ ఇంటర్‌లో ప్రతిభ

- జూనియర్ ఇంటర్‌లో 420 మార్కులు సాధించిన సృజనామృత


సృజనామృత

గోనెగండ్ల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ జూనియర్ ఇంటర్ బైపీసీ పరీక్షలో 440 మార్కులకు గాను 420 మార్కులు సాధించి సృజనామృతా అనే బాలిక తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచింది. గోనెగండ్లకు చెందిన ఉరుకుందగౌడ్, భార్య జానకి ఉద్యోగ రీత్య కర్నూలులో నివాసం ఉంటున్నారు. అయితే వీరి కూతురు సృజనామృతకు పదవ తరగతి చదువుతున్న సమయంలో క్యాన్సర్ వ్యాధి సోకింది. గత రెండేళ్లుగా వ్యాధి నయం చేసేందుకు గాను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పదవ తరగతి పరీక్షల సమయంలోనూ ఉదయం పరీక్షలు రాసి సాయంత్రం ఆసుపత్రిలో చికిత్స పొందాల్సి వచ్చేది. అలాగే పరీక్ష రాసి పదోతరగతిలో 493 మార్కులు సాధించింది. అలాగే చికిత్స పొందుతూ ప్రస్తుతం జూనియర్ ఇంటర్‌లో 420 మార్కులు సాధించి తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచింది. విషయం తెలుసుకున్న గోనెగండ్లలోని బాలిక బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కోసిగి విద్యార్థినికి స్టేట్ సెకండ్ ర్యాంకు


రిజ్వానా

కోసిగి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అక్షరాస్యతలో చిట్టచివరి నుంచి రెండో స్థానంలో ఉన్న కోసిగి మండలం ఇప్పుడిప్పుడే అక్షరాస్యతలో అన్ని మండలాల కంటే దీటుగా ముందుకు వెళ్తుందని చెప్పడానికి శనివారం విడుదలైన ఇంటర్ ఫలితాలు నిదర్శనం. కోసిగి చెందిన పింజారి రిజ్వానా ఇంటర్ సెకండియర్ బైపీసీలో 987/1000 మార్కులతో స్టేట్ రెండో ర్యాంకు సాధించారు. కోసిగి ఆర్టీసీ బస్టాండు ఎదురుగా నివాసముంటున్న పింజారి ఉమర్, ఫాతిమా దంపతుల మొదటి కుమార్తె పింజారి రిజ్వానా ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు కోసిగిలోని స్థానిక చౌడేశ్వరి పాఠశాలలో, 6 నుంచి 10 వరకు కోసిగిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించి 10లో 574 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచింది. ఇంటర్ విజయవాడలోని ఓ ప్రైవేటు కాలేజీలో చదివారు. కోసిగి విద్యార్థిని రెండో స్టేట్ ర్యాంకు సాధించడంపై మండల ప్రజలు, ఉపాధ్యాయులు రిజ్వానను అభినందించారు.

ప్రతిభా అవార్డుకు విద్యార్థి ఎంపిక


రాఘవేంద్ర

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీపీఅండ్ఎం చదువుతున్న రాఘవేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా అవార్డుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. స్థానిక జూనియర్ కళాశాలలో క్రాప్‌ప్రొడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ కోర్సులో అత్యుత్తమ ప్రతిభకనబరచి 1000 మార్కులకు గాను 958 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచారు. ఇంటర్మీడియట్‌లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభకనబరచిన విద్యార్థులను గుర్తించిన ప్రభుత్వం వారిని ప్రతిభా అవార్డులతో సన్మానించేందుకు ఎంపిక చేసింది. అవార్డులకు ఎంపికైన విద్యార్థులను ఈనెల 15 విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సన్మానించనున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, కోర్సు లెక్చరర్ శ్రీరాములు, సూర్యకుమారి, అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు.

ఎంపీహెచ్‌డబ్ల్యూలో 90 శాతం ఉత్తీర్ణత


మణి కుమారి

ఎమ్మిగనూరు పట్టణంలోని మైనార్టీ కాలనీలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయంలో గత ఏడాది కొత్త ప్రవేశపెట్టిన ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులో విద్యార్థినులు 90 శాతం ఉత్తీర్ణత సాధించారు. కొత్తగా ప్రవేశపెట్టిన కోర్సులో 37 మంది విద్యార్థినులు చేరారు. 37 మందికి గాను 33 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో ఎమ్మిగనూరు మండలం గార్లదిన్నె గ్రామానికి చెందిన ముత్తయ్య, సుశీలమ్మ కుమార్తె శావాడి మణికుమారి 500 మార్కులకు గాను 493 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభకనబరిచింది. మణికుమారితో పాటు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినిలను ఎస్ఓ కవిత అభినందించారు.